ప్రజా

# రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Districts

సంపుటి - 02 సంచిక -328 పేజీలు - 8 వెల - 03/- ఆదివారం15 మార్చి 2026



పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు , జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి

9948814188 9985876888


# మాట ఇచ్చాం.. పనులు చేస్తాం..



## గిరిజనులకు పవన్ కల్యాణ్ భరోసా

- మాది పీపుల్ ఫ్రెండ్లీ ప్రభుత్వం... ప్రజల కోసం ఎక్కడికైనా వస్తా: పవన్ కల్యాణ్
- గిరిజనుల మధ్య జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకున్న పవన్ కల్యాణ్
- 18 నెలల్లో ఏజెన్సీలో 460 కి.మీ. రోడ్ల నిర్మాణం చేపట్టామని వెల్లడి
- గత ప్రభుత్వం జలజీవన్ మిషన్ నిధులు మళ్లించిందని ఆరోపణ
- గ్రామస్థులు చెప్పిన పలు సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపిన ఉప ముఖ్యమంత్రి






**పాడేరు,మార్చి 14 (రిపబ్లిక్ న్యూస్):**
తమది 'పీపుల్ ఫ్రెండ్లీ ప్రభుత్వం' అని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పనిచేస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు నియోజకవర్గంలోని మారుమూల గిరిజన గ్రామం నందిగరువులో పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజనులతో 'మాట-మంతి' కార్యక్రమం నిర్వహించి, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. "గత ప్రభుత్వంలో కనీసం సమస్యలు చెప్పుకోవడానికి కూడా ప్రజలు భయపడేవారు.

మిగతా 2లో.

# గ్యాస్ పై ప్రజలు ఆందోళన చెందొద్దు




- కొరత సమస్య లేకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు
- మంత్రుల బృందం, ప్రత్యేక అధికారుల బృందాలు నిరంతర పర్యవేక్షణ
- కష్టం, నష్టాన్ని తగ్గించేందుకు ముమ్మర ప్రయత్నాలు
- సరఫరా వ్యవస్థల పునరుద్ధరణ, బలోపేతానికి కృషి
- వంట గ్యాస్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు
- ఆసుపత్రులు, హాస్టళ్ల కార్యకలాపాలకూ ప్రాధాన్యం
- రియల్ టైమ్ డేటా విశ్లేషణతో ప్రణాళికాయుత చర్యలు
- బ్లాక్ మార్కెటింగ్ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు
- వదంతులను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి
- రాష్ట్ర మంత్రులు కేశవ్, అచ్చెన్నాయుడు, మనోహర్

**విజయవాడ, మార్చి 14 (రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్రంలో వంట గ్యాస్ సరఫరా విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రజలకు ఇబ్బంది లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని, మంత్రుల బృందం నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తోందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. శనివారం కానూరులోని పౌర సరఫరాల రాష్ట్ర కార్యాలయంలో మంత్రులు పయ్యావుల కేశవ్, కింజరాపు అచ్చెన్నాయుడు, వర్చువల్‌గా నాదెండ్ల మనోహర్.. పౌర సరఫరాలు, సమాచార, పౌర సంబంధాలు, పోలీస్, విజిలెన్స్ తదితర సమన్వయ శాఖల అధికారులతో పాటు ఐవోసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ తదితర ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీల

మిగతా 2లో.



## భట్టి నివాసంలో ఏపీ సీఎం చంద్రబాబు...

భట్టి కుమారుడు, కోడలిని కలిసి ఆశీర్వదించిన చంద్రబాబు

రాజకీయాలకు అతీతంగా సాగిన ఆత్మీయ పలకరింపు

వివాహానికి హాజరుకాలేకపోవడంతో ఇప్పుడు శుభాకాంక్షలు తెలిపిన ఏపీ సీఎం

## దేశంపై యుద్ధప్రభావం పడకుండా చర్యలు

- గందరగోళ పరిస్థితులు సృష్టిస్తున్న కాంగ్రెస్
- దేశ ప్రయోజనాలకు భిన్నంగా కాంగ్రెస్ వైఖరి
- అసోం ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ విమర్శలు

**గౌహతి,మార్చి 14 (రిపబ్లిక్ న్యూస్):**
మధ్యప్రాచ్యంలో యుద్ధం ప్రభావం దేశంపై సాధ్యమైనంత తక్కువగా ఉండేలా కేంద్రం ప్రయత్నాలు చేస్తోందని ప్రధాని మోడీ చెప్పారు. అయితే ఇందుకు భిన్నంగా ఏమాత్రం బాధ్యతలేని విపక్షంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తోందని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అస్సాంలోని సిల్చార్‌లో శనివారంనాడు పర్యటించారు. రూ.23,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.22,864 కోట్లతో సిల్చార్-మేఘాలయలోని షిల్లాంగ్ మధ్య నిర్మించనున్న యాక్సెస్ కంట్రోల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు భూమి పూజ చేశారు

మిగతా 2లో.



## తమిళ కవి వైరముత్తుకు జ్ఞానపీఠం

అభినందనలు తెలిపిన స్టాలిన్, , కమల్ హసన్



**చెన్నై,మార్చి 14 (రిపబ్లిక్ న్యూస్):**
సాహితీ పురస్కారాల్లో అత్యున్నతమైన జ్ఞానపీఠ్ పురస్కారానికి 2025వ ఏడాదికిగాను తమిళ సినీ గేయ రచయిత వైరముత్తు పేరును ఎంపిక కమిటీ శనివారం ప్రకటించింది. ఆయనకు ముఖ్యమంత్రి స్టాలిన్, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్ తదితరులు

మిగతా 2లో.

# ఆరని యుద్ధ జ్వాలలు

## ఖర్గ్ దీవిపై అమెరికా దాడి

- ఐదు రీఫ్యూయలింగ్ విమానాలను ధ్వంసం చేసిన ఇరాన్
- సౌదీపై కొనసాగుతున్న క్షిపణి, డ్రోన్ దాడులు
- షరతులకు ఓకే అంటేనే యుద్ధాన్ని ముగిస్తాం : ఇరాన్ రాయబారి
- హార్ముజ్‌ను దాటిన రెండు భారత ఎల్పీజీ ట్యాంకర్లు
- మొజ్తాబాను పట్టిస్తే పది మిలియన్ డాలర్లు : అమెరికా ఆఫర్

అమెరికా- ఇజ్రాయిల్ సేనలు సైనిక చర్యలు ప్రారంభించిన తర్వాత ఇవే అత్యంత శక్తివంతమైన బాంబు దాడులని ఆయన తెలిపారు. ఇప్పటి వరకూ ఇరాన్‌లోని సుమారు ఐదు వేల లక్ష్యాలపై దాడులు జరిగినప్పటికీ అమెరికా, ఇజ్రాయిల్ దళాలు ఖర్గ్ దీవి వైపు చూడలేదు. ప్రస్తుతానికి దీవిలోని చమురు మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోలేదని ట్రంప్ చెప్పారు. అయితే హర్మూజ్ జలసంధిలో చమురు నౌకల ప్రయాణానికి ఇరాన్ కానీ, వేరెవరైనా కానీ ఆటంకం కలిగిస్తే తాను కూడా తన నిర్ణయాన్ని పునఃపరిశీలించుకుంటానని హెచ్చరించారు.

మిగతా 2లో.





## సర్వేయర్లపై సస్పెన్షన్ల ఎత్తివేత

56 మందిని విధుల్లోకి తీసుకుంటూ ఉత్తర్వులు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడి

**అమరావతి, మార్చి 14 (రిపబ్లిక్ న్యూస్):**
సర్వే శాఖలో అధికారులు సృష్టించిన కల్లోలం సద్దుమణిగింది. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ జోక్యంతో 56 మంది సర్వేయర్లపై విధించిన సస్పెన్షన్‌ను ప్రభుత్వం ఎత్తివేసింది.

మిగతా 2లో.

## పర్యావరణవేత్త సోనమ్ వాంగ్ చుక్‌కు స్వేచ్ఛ

నిర్బంధాన్ని రద్దు చేస్తూ హోంశాఖ ఉత్తర్వులు



2లో.

## ప్రజల సొమ్ము దోచుకుంటామంటే ఊరుకోం

- డీపీఆర్ లేకుండా ప్రజల ఇండ్లకు మార్కింగ్ ఎట్లా ఇస్తారు
- బఫర్ జోన్ పేరుతో పేదలను తరిమికొడుతున్నారు
- సీఎం రేవంత్‌రెడ్డి మాటల విలువ జీరో
- కాంగ్రెస్‌కు కూల్చడం తప్పా నిర్మాణం తెలియదు
- మూసీపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో కేటీఆర్




2లో.

# తమిళ కవి వైరముత్తుకు జ్ఞానపీఠం

**మొదటిపేజీ తరువాయి**

తమ 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. తేని జిల్లా మేట్టూర్‌లో 1953లో జన్మించిన వైరముత్తు కళాశాల విద్యార్థిగా ఉన్నప్పుడు రాసిన 'వైకరై మేఘంగళ్' కవితా సంకలనం అప్పట్లోనే ఓ మహిళా కళాశాలకు పాఠ్యాంశంగా మారింది. తమిళనాడు ప్రభుత్వ అధికారిక భాషా కమిషన్‌లో పని చేస్తున్నప్పుడే 1980లో దర్శక దిగ్గజం భారతీరాజా తెరకెక్కించిన 'నిళల్గళ్' చిత్రం ద్వారా సినీ గేయరచయితగా తమిళ చిత్ర పరిశ్రమకు పరిచయమయ్యారు. కవితలు, నవలలు తదితర సుమారు 40 పుస్తకాలు, సినిమాలో సుమారు 7,500 పాటలు రాశారు. ఇప్పటికే ఆయన సాహిత్య అకాడమీ, సాధన సమ్మాన్, పద్మశ్రీ, పద్మభూషణ్ వంటి ప్రతిష్టాత్మక పురస్కారాలు అందుకున్నారు. ఉత్తమ గేయ రచయితగా 7 సార్లు జాతీయ పురస్కారాలు అందుకున్న ఏకైక రచయిత ఆయన మాత్రమే. ఉత్తమ గేయ రచయితగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి 6 సార్లు పురస్కారాలు అందుకున్నారు. జ్ఞానపీఠ్ పురస్కారాన్ని ఇప్పటికే రాష్ట్రానికి చెందిన అఖిలన్ (1975), జయకాంతన్ (2002) అందుకోవడం గమనార్హం. జ్ఞానపీఠ్ అవార్డుకు ఎంపికైన వైరముత్తుకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ అభినందనలు తెలిపారు. 'తన కవితా పటిమతో తమిళ భాషను శాసిస్తున్న 'కవిపేరరసు' (కవి సామ్రాట్) వైరముత్తుకు జ్ఞానపీఠ్ పురస్కారం దక్కింది. ఈ రోజే నేను వైరముత్తును కలిసి మాట్లాడాను. ఆ భేటీ ముగిసిన కొద్దిసేపటికే ఈ తీపి కబురు రావడం ఆ సంతోషాన్ని మరింత రెట్టింపు చేసింది' అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు.ం

# దేశంపై యుద్ధప్రభావం పడకుండా చర్యలు

**మొదటిపేజీ తరువాయి**

. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ, అస్సాం ప్రజలను హింస, ఉగ్రవాదం వైపు కాంగ్రెస్ తప్పుదారి పట్టించిందని, అయితే ఇవాళ రాష్ట్రంలో సమృద్ధిగా అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఇవాళ ప్రపంచవ్యాప్తంగా యుద్ధ పరిస్థితులు నెలకొన్నాయి. దేశ ప్రజలపై ఆ ప్రభావం తగ్గించడానికి ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. వారి రక్షణ, శ్రేయస్సుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బాధ్యతాయుత ప్రతిపక్షంగా కాంగ్రెస్ వ్యవహరిస్తుందని ఆశిస్తాం. అయితే దేశ ప్రయోజనాల పరిరక్షణలో కాంగ్రెస్ మరోసారి విఫలమైందని విమర్శించారు. దేశంలో భయాందోళనలు సృష్టించేందుకు ప్రయత్నిస్తోంది. మోదీని దూషించడమే పనిగా పెట్టుకుంది. అంతర్జాతీయంగా భారత్ శీఘ్ర అభివృద్ధిని సాధించడం కొన్ని శక్తులకు ఇష్టంలేదు. అలాంటి శక్తుల చేతిలో కాంగ్రెస్ కీలుబొమ్మగా మారిందని మోదీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీకి అస్సాం గురించి కానీ, దేశం గురించి కానీ ఎలాంటి విజన్ లేదని మోదీ తప్పుపట్టారు. మోదీని దూషించడం, అబద్ధాలు, వదంతుల ప్రచారంతో ప్రజలను తప్పుదారి పట్టించడమే ఆ పార్టీకి తెలుసునని అన్నారు. బీజేపీ ప్రభుత్వం యువతకు అనేక అవకాశాలు కల్పించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆలోచనలు ఎక్కడ ఆగిపోతాయో, అక్కడి నుంచే తమ పని ప్రారంభమవుతుందని, అభివృద్ధిలో వెనుకబడిన వారికి ప్రాధాన్యత ఇవ్వడమే బీజేపీ ప్రధాన మంత్రమని చెప్పారు. మీరు కాంగ్రెస్‌ను ఇక్కడినుంచి ఎప్పుడో తరిమికొట్టారని వ్యాఖ్యానించారు. రానున్న ఎన్నికల్లోనూ ప్రతి రాష్ట్రం ఆ పార్టీకి గుణపాఠం చెప్పనుంద న్నారు. ఇటీవల దిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో యూత్ కాంగ్రెస్ నేతలు చొక్కాలు విప్పి నిరసనలు తెలపడం రాజకీయంగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ.. మొత్తం దేశం ఈ చర్యను ఖండించిందన్నారు. ఓటమితో నిరాశ చెందిన కాంగ్రెస్ దేశం పైనే దాడికి దిగిందన్నారు. నిరాశతో దుస్తులు చింపుకోవడం తప్ప.. వాళ్లకి మరేమీ మిగల్లేదని ఎద్దేవా చేశారు.

# భట్టి నివాసంలో ఏపీ సీఎం చంద్రబాబు...

**భట్టి కుమారుడు, కోడలిని కలిసి ఆశీర్వదించిన చంద్రబాబు**

**రాజకీయాలకు అతీతంగా సాగిన ఆత్మీయ పలకరింపు**

**వివాహానికి హాజరుకాలేకపోవడంతో ఇప్పుడు శుభాకాంక్షలు తెలిపిన ఏపీ సీఎం**



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం హైదరాబాద్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నివాసానికి వెళ్లారు. ఇటీవల వివాహం చేసుకున్న భట్టి కుమారుడు సూర్య విక్రమాదిత్య, కోడలు సాక్షిలను ఆశీర్వదించేందుకు చంద్రబాబు ఆయన ఇంటికి చేరుకున్నారు.చంద్రబాబుకు భట్టి విక్రమార్క సాదర స్వాగతం పలికారు. అనంతరం నూతన దంపతులను కలిసిన చంద్రబాబు, వారికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. దంపతులు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు కాసేపు ఆత్మీయంగా మాట్లాడుకున్నారు.ఇటీవల భట్టి విక్రమార్క తన కుమారుడి వివాహానికి చంద్రబాబును ఆహ్వానించేందుకు స్వయంగా అమరావతికి వెళ్లారు. అయితే, అప్పటి పనుల ఒత్తిడి కారణంగా చంద్రబాబు వివాహ వేడుకకు హాజరు కాలేకపోయారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ పర్యటనలో భాగంగా భట్టి ఇంటికి వెళ్లి నూతన దంపతులకు విషెస్ తెలియజేశారు.మార్చి 5న శంషాబాద్ జీఎంఆర్ ఎరీనాలో జరిగిన ఈ వివాహ వేడుకకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, సినీనటుడు చిరంజీవి వంటి పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు హాజరైన విషయం తెలిసిందే.

## పర్యావరణవేత్త సోనమ్ వాంగ్ చుక్‌కు స్వేచ్ఛ నిర్బంధాన్ని రద్దు చేస్తూ హోంశాఖ ఉత్తర్వులు

**న్యూఢిల్లీ,మార్చి 14 (రిపబ్లిక్ న్యూస్):** పర్యావరణవేత్త సోనమ్ వాంగ్ చుక్ నిర్బంధాన్ని రద్దు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ ప్రకటన విడుదల చేసింది. దాదాపు ఆరు నెలల తర్వాత ఆయన జైలు నుంచి విడుదల కానున్నారు. లద్దాఖ్ కు రాష్ట్ర హోదా డిమాండ్ చేస్తూ గతేడాది లేహ్ ప్రాంతంలో అల్లర్లు జరిగిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో జరిగిన హింసాత్మక ఘటనల్లో నలుగురు ప్రాణాలు కోల్పోగా.. అనేక మంది గాయపడ్డారు. ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ పిలుపుతోనే ఈ ఆందోళనలు జరిగాయని కేంద్రం వెల్లడించింది. ఈ క్రమంలోనే జాతీయ భద్రత చట్టం కింద అతన్ని పోలీసులు అరెస్టు చేశారు. శాంతి భద్రతలను కాపాడాలనే ఉద్దేశంతో కస్టడీలోకి తీసుకున్నట్లు హోంశాఖ ప్రకటనలో వెల్లడించింది. లద్దాఖ్‌లో శాంతికి కట్టుబడి ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించింది. ఈ క్రమంలో వాంగ్‌చుక్ నిర్బంధాన్ని తక్షణమే రద్దు చేయాలని నిర్ణయించినట్టు పేర్కొంది. అయితే, ప్రస్తుతం కొనసాగుతున్న బంద్‌లు, నిరసనల వాతావరణం శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నాయని అభిప్రాయపడింది.

# సర్వేయర్లపై సస్పెన్షన్ల ఎత్తివేత

**మొదటిపేజీ తరువాయి**

వారిపై క్రమశిక్షణ చర్యలను ఉపసంహరించింది. 28 జిల్లాల గ్రామ సర్వేయర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను విధుల్లోకి తీసుకుంటూ సర్వే, సెటిల్‌మెంట్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులు, ఇతర సిబ్బందితో సమానంగా తమకు బేసిక్ పే రూ.30వేలకు పెంచాలని, గ్రేడ్-1 పదోన్నతులు, టెక్నికల్ అలవెన్సులు ఇవ్వాలని, రీసర్వే విధుల నిర్వహణకు ల్యాప్‌టాప్, రోవర్లు, ఇతర సామగ్రి అందించాలని, బకాయిలు చెల్లించాలని కోరుతూ సర్వేయర్లు గత కొంతకాలంగా ఆందోళన చేస్తున్నారు. ఈ డిమాండ్లపై సమ్మె చేయాలని నిర్ణయించారు. వారితో చర్చలు జరిపి ఆందోళన విరమింపజేయాల్సిన రెవెన్యూ, సర్వే శాఖల ఉన్నతాధికారులు కన్నెర్ర చేశారు. మంత్రికి మాట మాత్రం చెప్పకుండా నిర్ణయాలు తీసుకొన్నారు. ఆందోళనలో ఉన్న సర్వేయర్ల సంఘం జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు 56 మందిని సస్పెండ్ చేశారు. తనకు తెలియకుండా ఇంత పెద్ద నిర్ణయం ఎందుకు తీసుకున్నారంటూ అధికారులపై మంత్రి సీరియస్ అయ్యారు. గత మంగళవారం సర్వేయర్ల సంఘం ప్రతినిధులను అమరావతికి పిలిపించి చర్చలు జరిపారు. అనంతరం రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్, భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ జయలక్ష్మితో అనగాని సమావేశమయ్యారు.

# ఆరని యుద్ధ జ్వాలలు

**మొదటిపేజీ తరువాయి**

ఆర్థిక-చమురు ఆదాయాలకు కీలకం

ఖర్గ్ దీవిని ఇరాన్‌కు చెందిన అత్యంత కీలక ఆర్థిక లక్ష్యంగా భావిస్తారు. ఇరాన్ ఆర్థిక, చమురు ఆదాయాలలో ఈ దీవి ప్రధాన పాత్ర పోషిస్తోంది. అక్కడ పెద్ద ఎత్తున చమురు నిల్వలు ఉన్నాయి. ఖర్గ్ దీవి నుంచి పైప్‌లైన్లు నిర్మించి ఇరాన్‌లోని అతి పెద్ద చమురు, గ్యాస్ క్షేత్రాలతో అనుసంధానించారు. ఈ దీవి ద్వారా ఏటా 950 మిలియన్ బ్యారల్స్ ముడి చమురు రవాణా అవుతోంది. ఖర్గ్‌లో ట్యాం కర్లు చమురును నింపుకొని భారత్, చైనా వంటి ఆసియా మార్కెట్లకు చేరవేస్తుంటాయి. దీవిలోని చమురు మౌలిక సదుపాయాలపై బాంబు దాడులు జరిగితే ఇరాన్ నుంచి జరిగే రోజువారీ ముడి చమురు ఎగుమతులలో 90 శాతం నిలిచిపోతాయి. ఫలితంగా చమురు ధరలు అందుబాటులో లేకుండా పోతాయి.

2024లో చమురు అమ్మకాల ద్వారా ఇరాన్ రూ.7.2లక్షల కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఇందులో ఎక్కువ భాగం ఖర్గ్ నుంచి ముడి చమురు విక్రయం ద్వారా లభించిందే. అందుకే ఇప్పటి వరకూ అమెరికా, ఇజ్రాయిల్ సేనలు ఆ దీవి వైపు చూడలేదు. తాజా దాడిలో చమురు మౌలిక సదుపాయాలకు ఎలాంటి నష్టం వాటిల్లనప్పటికీ బ్యారల్ ముడిచమురు ధరలు 150 డాలర్లకు చేరుకునే అవకాశం ఉంది. ఇరాన్‌కు ఆర్థికంగా వెన్నుదన్నుగా ఉన్న ఖర్గ్ దీవిని స్వాధీనం చేసుకునే అవకాశాలపై శ్వేతసౌధంలో ఇటీవల అమెరికా అధికారులు సమాలోచనలు జరిపారు. ఖర్గ్ దీవిపై జరిగిన దాడి నేపథ్యంలో యుద్ధం మరింత తీవ్రమయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి.

ప్రతీకారం తప్పదు : ఇరాన్

అలీ ఖమేనీ హత్యకు ప్రతీకారం తీర్చుకుంటామని, దెబ్బకు దెబ్బ తీస్తామని ఇరాన్ ప్రకటించింది. అత్యాధునిక ఆయుధాలతో శత్రువులపై దాడి చేస్తామని తెలిపింది. ఇరాన్ దాడుల కారణంగా అమెరికా వాయు సేనకు భారీ నష్టం జరిగింది. సౌదీ అరేబియాలోని అమెరికా వైమానిక స్థావరాలపై ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడింది. ఈ దాడిలో అమెరికాకు చెందిన ఐదు రీఫ్యూయలింగ్ విమానాలు ధ్వంసమయ్యాయి. అమెరికా అధికారులను ఉటంకిస్తూ వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రిక ఈ విషయాన్ని తెలియజేసింది. సౌదీ అరేబియాలోని అమెరికా వైమానిక స్థావరంపై ఇరాన్ జరిపిన దాడిలో ఐదు కేసీ-135 రీఫ్యూయలింగ్ విమానాల ట్యాంకర్లు దెబ్బతిన్నాయని ఆ పత్రిక చెప్పింది. తమ దేశంపై ఇరాన్ క్షిపణి, డ్రోన్ దాడులు కొనసాగిస్తోందని బహ్ రైన్ తెలిపింది. ఇప్పటి వరకూ ఇరాన్ నుంచి 124 క్షిపణులు, 203 డ్రోన్లు వచ్చి పడ్డాయని చెప్పింది.

ఎల్పీజీ ట్యాంకర్లకు గ్రీన్‌సిగ్నల్

హర్మూజ్ జలసంధి మీదుగా ప్రయాణించేందుకు భారత్‌కు చెందిన రెండు ఎల్పీజీ ట్యాంకర్లను ఇరాన్ అనుమతించింది. దీంతో భారత పతాకం ఉన్న శివాలిక్, నందాదేవి అనే రెండు ఇంధన నౌకలు శనివారం హర్మూజ్ జలసంధిని దాటాయి. జలసంధిలో భారత్ జెండాలున్న 28 నౌకలు చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. శివాలిక్ నౌకలో 40,000 మెట్రిక్ టన్నుల గ్యాస్ ఉంది. నందాదేవిలో కూడా భారీ పరిమాణంలో గ్యాస్ రవాణా అవుతోంది.

# మాట ఇచ్చాం.. పనులు చేస్తాం..

**మొదటిపేజీ తరువాయి**

కానీ ఇప్పుడు ప్రభుత్వ యంత్రాంగమే మీ గడప వద్దకు వచ్చి సమస్యలు తెలుసుకునేలా పాలనను ప్రక్షాళన చేశాం. మీరు కష్టాలు చెప్పుకోవడానికి రోడ్ల మీదకు రాకముందే వాటిని పరిష్కరించడానికి మేము సిద్ధంగా ఉన్నాం" అని భరోసా ఇచ్చారు.

గత ప్రభుత్వం నిధులు మళ్లించడం వల్లే ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడిపోయిందని పవన్ కల్యాణ్ ఆరోపించారు. "జలజీవన్ మిషన్ పథకంలో రూ.4 వేల కోట్లు దుర్వినియోగం చేశారు. కానీ మేము అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే ఏజెన్సీ గ్రామాల్లో 460 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మించాం. గిరి శిఖర గ్రామాల్లో గర్భిణీలు పడుతున్న డోలీ కష్టాలు ఇక కనిపించకూడదన్నదే మా లక్ష్యం" అని వివరించారు. కేవలం 40 గడపలున్న నందిగరువు గ్రామానికి రూ.2 కోట్లతో రోడ్డు నిర్మించిన విషయాన్ని గుర్తుచేశారు.

జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని లక్షలాది మంది మధ్య కాకుండా, 70 ఏళ్లుగా రోడ్డుకు నోచుకోని



మారుమూల గిరిజన గ్రామంలో జరుపుకోవడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని పవన్ అన్నారు. "ఈ ప్రాంతంలో కూటమి అభ్యర్థులు గెలవకపోయినా మేము ఎక్కడా వివక్ష చూపించం. మీరు ఓట్లు వేశారా లేదా అని చూడకుండా, మీరు బాగుండాలనే పనిచేస్తాం. మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న ఇలాంటి ప్రాంతాలకు రావడానికి నాయకులు భయపడతారేమో కానీ, ప్రజల కోసం పనిచేసే నాకు ఎలాంటి భయాలు లేవు" అని స్పష్టం చేశారు.

'మాట-మంతి'లో భాగంగా గ్రామస్థులు ప్రస్తావించిన పలు సమస్యలకు పవన్ కల్యాణ్ అక్కడికక్కడే పరిష్కారాలు చూపారు. ఓనూరు పాఠశాల మరమ్మతులు, కొత్తపాలెం గ్రామానికి 1.6 కి.మీ. రోడ్డు మంజూరు, అసంపూర్తిగా ఉన్న పాఠశాల, అంగన్‌వాడీ భవనాల పూర్తికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గిరిజనుల హక్కులకు భంగం వాటిల్లకుండా అభివృద్ధి చేసి చూపిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# గ్యాస్ పై ప్రజలు ఆందోళన చెందొద్దు

**మొదటిపేజీ తరువాయి**

ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎల్‌పీజీ రోజువారీ అవసరాలు, సరఫరా స్థితిగతులతో పాటు భవిష్యత్తు కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. రియల్ టైమ్ డేటా విశ్లేషణ ఆధారంగా పటిష్ట కార్యాచరణతో ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. అనంతరం మంత్రి పయ్యావుల కేశవ్.. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఉన్నతాధికారులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గౌరవ ప్రధాని నేతృత్వంలో కేంద్రం, గౌరవ సీఎం నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మంత్రుల బృందంతో పాటు అధికారుల బృందాలు నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తూ పటిష్ట కార్యాచరణతో ముందుకెళ్తూ భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. వదంతులు నమ్మవద్దని కోరారు. గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ వాతావరణం కారణంగా, నౌకల రవాణాకు ఆటంకం వల్ల సరఫరా వ్యవస్థలో సమస్యలు ఉత్పన్నమయ్యాయని.. అయితే వ్యవస్థల పునరుద్ధరణకు, బలోపేతానికి, కొత్త మార్గాల అన్వేషణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, కేంద్రం మార్గదర్శకాలతో రాష్ట్ర స్థాయిలో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇతర పెట్రోలియం ఉత్పత్తులను తగ్గించి, గ్యాస్ ఉత్పత్తిని పెంచాలని కేంద్రం దేశవ్యాప్త రిఫైనరీలను ఆదేశించిందని, దీనివల్ల ఉత్పత్తి 10 శాతం నుంచి 20 శాతం వరకు పెరుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా కుటుంబాలపై ప్రభావం పడకుండా వంట గ్యాస్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్నారు. ఆసుపత్రులు, వసతిగృహాల కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. గ్యాస్ సిలిండర్లపై కేంద్రం కొన్ని పరిమితులు విధించిందని.. ప్రస్తుతానికి పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు, డబుల్ సిలిండర్లు ఉన్నవారికి 32 రోజులకు సిలిండర్ పొందేలా మార్గదర్శకాలు ఉన్నాయన్నారు. అనవసరంగా ఆందోళనకు గురికావద్దని, కష్టాన్ని, నష్టాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు:విపత్కర పరిస్థితులను లాభార్జన కోసం ఉపయోగించుకోవాలనే తలంపుతో ఎవరైనా బ్లాక్ మార్కెటింగ్ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గౌరవ సీఎం ఆదేశాలతో ప్రత్యామ్నాయాలపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే హోటళ్లు, గ్యాస్ డీలర్లు తదితర అసోసియేషన్లతో సమావేశాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. విపత్కర కాలంలో వివిధ రకాల వినూత్న ఆప్షన్లను ముందుకు తీసుకొస్తున్నారన్నారు. ప్రజల సలహాలు, సూచనలను కూడా స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 95 శాతం ఆన్‌లైన్ బుకింగ్‌లు జరుగుతున్నాయని, 88 శాతం వరకు ఓటీపీ ఆధారిత గ్యాస్ సిలిండర్ల డెలివరీలు జరుగుతున్నాయని.. ఈ శాతాన్ని పెంచాలని సంస్థలకు సూచించామన్నారు. ఆర్‌టీజీఎస్ తో పాటు కలెక్టర్ల కార్యాలయాల్లోనూ ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రత్యామ్నాయ వనరులను ఉపయోగించు కోవడంలో భాగంగా పైప్డ్ గ్యాస్‌పైనా ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నట్ల మంత్రి తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి దార్శనికతతో విజయవాడతో పాటు వివిధ నగరాల్లో విజయవంతంగా నడుస్తున్న పైప్డ్ గ్యాస్ నేడు వరంగా మారాయని పేర్కొన్నారు. నేచురల్ గ్యాస్‌ను సమర్థవంతంగా వినియోగించుకునే విషయంపై ముఖ్యమంత్రి కార్యాలయం ఇప్పటికే దృష్టిసారించినట్లు మంత్రి పయ్యావుల కేశవ్ వివరించారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్, డైరెక్టర్ శ్రీవాస్ నుపుర్ అజయ్‌కుమార్, సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కేఎస్ విశ్వనాథన్, సమన్వయ శాఖల ఉన్నతాధికారులు, చమురు సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సొమ్ము దోచుకుంటామంటే ఊరుకోం

## మూసీపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో కేటీఆర్

రంగారెడ్డి **మార్చి 14 (రిపబ్లిక్ న్యూస్):** మూసీ సుందరీకరణకు, అభివృద్ధికి తాము ఏమాత్రం వ్యతిరేకం కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్షల కోట్ల అవినీతి ప్రణాళికలకు వ్యతిరేకమని, కచ్చితంగా అవినీతిని అడ్డుకుంటామని తెలిపారు. శనివారం రంగారెడ్డి జిల్లా రాజేందర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని హిమాయత్‌సాగర్ ప్రాంతంలో 'మూసీ పునరుజ్జీవం-పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ వర్సెస్ పబ్లిక్ పాయింట్' అనే కార్యక్రమాన్ని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాజేందర్‌నగర్ ఇన్‌చార్జి పటోళ్ల కార్తీక్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భం గా కేటీఆర్ మాట్లాడారు.. పేదల భూముల విలువ ' జీరో ' అంటున్న సీఎం రేవంత్‌రెడ్డి మాటలకు విలువ లేదని అన్నారు. పేదల భూముల విలువ రూ. లక్షా 50 వేల కోట్లని, ఆ విలువైన భూములపై కన్నేసిన ముఖ్యమంత్రి .. మూసీ ప్రణాళికను తెరపైకి తెచ్చారని ఆరోపించారు.

'రాష్ట్ర ప్రభుత్వం బఫర్ జోన్ పేరు చెప్పి ప్రజలను భయపెట్టి వారి ఇండ్లను కూలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి సొంత ఇల్లు రెడ్డి కుంట బఫర్ జోన్‌లో ఉన్నది నిజం కాదా, దాని గురించి ఎందుకు మాట్లాడటం లేదు. సీఎం సోదరుడి ఇల్లు హైదరాబాద్‌లో బఫర్ జోన్‌లో ఉంది. మంత్రుల ఫామ్‌హౌస్‌లు, ఇండ్లు కూడా బఫర్ జోన్‌లో ఉన్నాయి. వాటిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు' అని కేటీఆర్ ప్రశ్నించారు. 20ఏండ్ల కింద కట్టుకున్న అపార్ట్‌మెంట్లను, ఇండ్లను కూలగొడతా అంటున్న ముఖ్యమంత్రి ఇప్పుడు మూసీ బఫర్ జోన్‌లో కడుతున్న రియల్ ఎస్టేట్ సంస్థల అపార్ట్‌మెంట్‌లను మాత్రం ముట్టుకోను అనడంలో అర్థం ఏంటనీ ప్రశ్నించారు.

ఒకటి, రెండు అపార్ట్‌మెంట్ వాసులకు ఇండ్లు కట్టించి తగిన స్థలం ఇస్తామని చెబుతున్న రేవంత్‌రెడ్డి, అదే సూత్రం అదే న్యాయం బాధితులందరికీ వర్తింపజేస్తారా అనే ప్రశ్నకు సమా ధానం చెప్పాలన్నారు. రేవంత్‌రెడ్డికి తమ కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకువచ్చిన 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఇవ్వాల్సిన పరిహారం ఎంతో అనే అంశంపై అవగాహన కూడా లేదన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం రూ.16వేల కోట్లతో ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా మూసీని అభివృద్ధి చేసే ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. ఎలాంటి డీటెయిల్స్ ప్లానింగ్ రిపోర్టు (డీపీఆర్) లేకుండా సోషల్ ఇంఫాక్ట్ స్టడీ, ఎన్విరాన్మెంటల్ ఇంపాక్ట్ స్టడీ వంటి నివేదికలు, ప్రజలతో ఎలాంటి చర్చలు లేకుండా ఇండ్లను కూలగొడతామని భయాందోళనకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

గత ప్రభుత్వంలో కేసీఆర్ పీపీటీ ప్రజెంటేషన్ ద్వారా నదుల నీటి వినియోగం ప్రాజెక్టుల నిర్మాణం గురించి వివరిస్తే, రేవంత్‌రెడ్డి పీపీటీ ద్వారా ఎవరి ఇల్లు ఎట్లా కూలగొట్టాలి, ఎవరి భూములు ఎట్లా లాక్కోవాలి.. అనే విధ్వంసం గురించి పీపీటీ ఇచ్చార న్నారు. వందల కిలోమీటర్ల నమోమి గంగాకి ఖర్చు కేవలం రూ.42 వేల కోట్లు అయితే, 55 కిలోమీటర్ల మూసీకి రూ.1.50 లక్షల కోట్లు ఎందుకు ఖర్చవుతుందనే ప్రశ్నకు రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వివేకానందగౌడ్, సబితా ఇంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, శాసనమండలి మాజీ చైర్మెన్ స్వామి గౌడ్, పార్టీ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, పార్టీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు:-పిహెచ్సి డాక్టర్ ఈ.వి.నాగలక్ష్మి దేవి.

### .జాతీయ ఒలింపియాడ్ సైన్స్‌లో పాములపాడు శ్రీ వివేకానంద విద్యా విహార్ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

### జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్స్ సాధించిన వివేకనంద హైస్కూల్ విద్యార్థులు అభినందనల వెల్లువ

**పాములపాడు మార్చి 14 రిపబ్లిక్ న్యూస్:-**
నంద్యాల జిల్లా, మండల కేంద్రమైన పాములపాడుకు చెందిన శ్రీ వివేకానంద విద్యా విహార్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ సైన్స్ పరీక్షల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్స్ సాధించారు.

పాఠశాలలో 4వ మరియు 6వ తరగతులు చదువుతున్న తోయ జాక్షి, నాగేంద్రుడు, సింధు లు జాతీయ స్థాయిలో ఉత్తీర్ణత సాధించి గోల్డ్ మెడల్స్ పనింద్ర, సరిత, మధుప్రియ, వైష్ణవి, విజయ, రాజేంద్రప్రసాద్ లు జాతీయ సైన్స్ ఒలంపియాడ్ ప్రశంస పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారిణి డాక్టర్ ఇ.వి.నాగలక్ష్మి దేవి ముఖ్య అతిథిగా పాల్గొని విజేత విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రధానం చేసి అభినందించారు.

అలాగే అదే పాఠశాలకు చెందిన మరో ఎనిమిది మంది విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రశంసా పత్రాలు మరియు బహుమతులు అందుకున్నారు.

ఈ సందర్భంగా పీహెచ్సీ డాక్టర్ ఇ.వి.నాగలక్ష్మిదేవి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు కూడా కృషి, పట్టుదలతో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. పాఠశాల నిర్వహణ, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందిస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ అనేటడ్ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్మెంట్





అసోసియేషన్ నంద్యాల జిల్లా నాయకులు క్రీస్తు దాసు మాట్లాడుతూ కార్పొరేట్ స్కూళ్లలో నిర్వహించే సైన్స్ ఒలంపియాడ్ పరీక్షలు గ్రామీణ ప్రాంతమైన వివేకానంద హై స్కూల్ లో నిర్వహించడం గుణాత్మక విద్య కు నాంది పలుకుతుందన్నారు . పరీక్షలు మూడు గోల్డ్ మెడల్స్ ఎనిమిది మందికి పైగా జాతీయస్థాయిలో సైన్స్ ఇంగ్లీష్ మ్యాథమెటిక్స్ లలో వరుసగా అత్యున్నత ప్రతిభ సాధించారన్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఆర్ఎస్ఆర్. గోపాల్ మాట్లాడుతూ సైన్స్ ఒలంపియాడ్ ఫెడరేషన్ ద్వారా 70 దేశాల్లో నిర్వహించే ఐఎస్ఓఐఎంఈఎన్ఎస్ఓ వంటి నేషనల్ సైన్స్ ఒలంపియాడ్ పోటీల్లో శ్రీ వివేకానంద హైస్కూల్ విద్యార్థులు పాల్గొని అత్యున్నత స్థాయి పురస్కారాన్ని పొందడమే కాకుండా మూడు గోల్డ్ మెడల్స్ 8 కి పైగా ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ ఒలంపియాడ్ ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలంపియాడ్ నేషనల్ ఒలంపియాడ్స్ లో జాతీయస్థాయి ప్రశంసా పత్రాలు విద్యార్థుల ప్రతిభ పాటలకు సంబంధించిన సర్టిఫికెట్లను అందజేయడం జరిగిందన్నారు. రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు చల్లా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో శ్రీ వివేకానంద విద్యా విహార్ హైస్కూల్ స్థాపించి ఎంతోమంది గ్రామీణ విద్యార్థులను జాతీయస్థాయికి తీసుకెళ్లాల ప్రతిభను వెలికితీస్తూ నేషనల్ ఒలంపియాడ్ పరీక్షలలో గోల్డ్ మెడల్స్ సాధించేలా కృషి చేసిన కరస్పాండెంట్ ఆర్ఎస్ఆర్.గోపాల్ ని అభినందించారు. భవిష్యత్తులో కాంపిటీటివ్ ఎగ్జామ్స్ ని తట్టుకునేలా ఇలాంటి పరీక్షలు విద్యార్థులకు ఎంతో ఉపయోగంగా ఉంటాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పిల్లలను జాతీయస్థాయి ఒలంపియాడ్ పరీక్షల్లో గోల్డ్ మెడల్స్ ప్రశంసా పత్రాలు వచ్చేలా కృషిచేసిన వివేకానంద పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు & హెడ్మాస్టర్ రాయపాటి శ్రీదేవి, ఉపాధ్యాయులు బాలకృష్ణ, షాజహాన్, సురేంద్ర, రామస్వామి, హబీబుల్లా, విజయ్, నారాయణ, ఆచారి, జయలక్ష్మి, చంద్రకళ, గాయత్రి, నసీమా, పుష్పలత, రాణి, శ్రీలక్ష్మి, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# బుధవారపేటలో మెగా కార్డన్ సెర్చ్ ఆపరేషన్

### "ఆపరేషన్ వజ్రప్రహార్"లో డ్రోన్ నిఘా 120 మంది, 50 వాహనాల తనిఖీ





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 14)**
మాదకద్రవ్యాల నియంత్రణ లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ చేపట్టిన "ఆపరేషన్ వజ్రప్రహార్" కార్యక్రమంలో భాగంగా కర్నూలు నగరంలోని బుధవారపేట ప్రాంతంలో శనివారం మెగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. డ్రోన్ కెమెరాల సహాయంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అనుమానాస్పద కదలికలను పోలీసులు పర్యవేక్షించారు.

రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఈగల్ చీఫ్ ఏకే రవి కృష్ణ ఐపీఎస్ పర్యవేక్షణలో, కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మాదకద్రవ్యాల వినియోగం మరియు అక్రమ రవాణాను అరికట్టేందుకు ఈ ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.కర్నూలు డీఎస్పీ జె. బాబు ప్రసాద్ పర్యవేక్షణలో, మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ శేషయ్య ఆధ్వర్యంలో బుధవారపేట ప్రాంతంలో ఈ తనిఖీలు విస్తృతంగా నిర్వహించారు. రాష్ట్రంలో గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, సంబంధిత నేరాలను అరికట్టడమే ఈ ఆపరేషన్ ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొత్తం 50 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. తనిఖీలలో భాగంగా 120 మంది వ్యక్తులను పరిశీలించగా, 50 వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 10 వాహనాలను గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు.ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే ఏపీ ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది మరియు స్థానిక ప్రజలతో కలిసి "ఆపరేషన్ వజ్రప్రహార్ ప్రతిజ్ఞ" నిర్వహించారు. సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడంలో ప్రజల సహకారం ఎంతో కీలకమని అధికారులు పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదకద్రవ్యాల వ్యాప్తిని పూర్తిగా అరికట్టే దిశగా "ఆపరేషన్ వజ్రప్రహార్" కింద ఇలాంటి ప్రత్యేక చర్యలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కర్నూలు పట్టణ సీఐలు శేషయ్య, విక్రమసింహా, చంద్రబాబు నాయుడు, తేజమూర్తి, నాగరాజా రావు, పార్థసారథి, కర్నూలు ఈగల్ టీం ఎస్సై సుజన్ కుమార్ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రహదారి నిర్మాణాల్లో నాణ్యత తప్పనిసరి: కమిషనర్ విశ్వనాథ్ హెచ్చరిక

### రూ.2 కోట్ల బి.టి. రహదారి పనులపై ఆగ్రహం

### గుత్తేదారుల బిల్లులు నిల్వ ఉంచొద్దని ఆదేశం -ఇంజనీరింగ్ అధికారులకు కట్టుదిట్టమైన పర్యవేక్షణ సూచన





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 14)**
కర్నూలు నగరంలో చేపడుతున్న రహదారులు, డ్రైనేజీ కాలువలు వంటి మౌలిక సదుపాయాల పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ స్పష్టం చేశారు. నాణ్యత లోపాలు ఉంటే సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

శనివారం చెక్‌పోస్ట్ సమీపంలో నందికొట్కూరు రహదారి నుంచి నంద్యాల రహదారికి అనుసంధానంగా నిర్మిస్తున్న బి.టి. రహదారిని ఆయన పరిశీలించారు. రూ.2 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ రహదారి పనుల తుది దశలో నాణ్యత లోపాలు ఉన్నాయని గుర్తించి అసహనం వ్యక్తం చేశారు.గుత్తేదారుల బిల్లులను అధికారులు ముందుకు పంపకుండా రెండు నెలలుగా తమ వద్దే పెండింగ్‌లో ఉంచడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే జేసీబీ వాహనానికి లాగ్‌బుక్ నిర్వహించకపోవడాన్ని తప్పుబట్టారు. ఇంధన వినియోగానికి సంబంధించి పూర్తి లెక్కలు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. రహదారి కొలతలు పట్టి విస్తీర్ణాన్ని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పనుల తుది దశలో నిర్లక్ష్యం చేయడం వల్ల రహదారుల నాణ్యత దెబ్బతింటుందని అన్నారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని సూచించారు. గుత్తేదారులు పనులను నిబంధనల ప్రకారం పూర్తి చేసి, నాణ్యత లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. ప్రజాధనాన్ని సమర్థవంతంగా వినియోగించాలని, ఇష్టానుసారం వ్యవహరిస్తే సహించబోమని కమిషనర్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డీఈఈ నరేష్, ఏఈ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇఫ్తార్ విందు పాల్గొన్న మాజీ మంత్రి విడదల రజని



**చిలకలూరిపేట ప్రతినిధి, మార్చి 14,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని 10వ వార్డు ఇస్లాంపేటలో ముస్లిం మత పెద్దలు ఘనంగా ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. శనివారం రోజు ఉపవాస దీక్షలు విరమించిన ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసిన ఈ విందు కార్యక్రమానికి మాజీ మంత్రి, విడదల రజని ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ఆమె ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ మాసం క్రమశిక్షణకు, దానగుణానికి ప్రతీక అని, అందరూ



సుఖసంతోషాలతో ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు ముస్లిం మత పెద్దలు, స్థానిక నాయకులు మరియు పెద్ద ముస్లిం సోదరులు పాల్గొన్నారు

# కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం & జూనియర్ కళాశాల అడ్మిషన్లు ప్రారంభం,

**ఓబులవారిపల్లి మార్చి 14 రిపబ్లిక్ న్యూస్.**
ఓబులవారిపల్లి మండలం చిన్నఓరంపాడు పంచాయతీ కడప చెన్నై జాతీయ రహదారి చిన్నఓరంపాడు క్రాస్ సమీపంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం మరియు జూనియర్ కళాశాల లకు 2026 మరియు2027 విద్యా సంవత్సరమునకు గాను అడ్మిషన్లు ప్రారంభించినట్లు శనివారం సంబంధిత అధికారులు తెలియజేశారు, మార్చి 12,2026 నుండి ఏప్రిల్ 1, 2026 వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు, విద్యార్థినీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలియజేశారు, భద్రత,వసతి,నాణ్యమైన విద్య, అంకితభావం



కలిగిన ఉపాధ్యాయులు, లెక్చరర్లు కస్తూర్బా గాంధీ కళాశాలలో అందుబాటులో ఉన్నారు తల్లిదండ్రులు అర్హత కలిగిన బాలబాలికలను నిర్దేశించిన టైములో దరఖాస్తు చేసుకుని మీ పిల్లలకు మంచి భవిష్యత్తును అందివ్వాలని నిర్వాహకులు తెలిపారు కస్తూర్బా గాంధీ విద్యాలయము మరియు జూనియర్ కళాశాల లో ఆన్లైన్లో గాని ఆఫ్లైన్ ద్వారా గాని దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలియజేశారు, దరఖాస్తు చేసుకునే అర్హత కలిగిన బాలబాలికలు సమాచారం కొరకు క్రింది నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం పొందవచ్చని తెలియజేశారు 7386868529, 7702064985,,9642280238.

# కర్నూలులో విషాదం

### - ఇద్దరు బిడ్డలతో కలిసి తల్లి ఆత్మహత్య

గార్గేయపురం గ్రామ చెరువులో దూకి ముగ్గురు మృతి కుటుంబ కలహాలే కారణమా?




**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 14)**దకర్నూలు జిల్లాలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. కర్నూలు మండలం గార్గేయపురం గ్రామంలో తల్లి తన ఇద్దరు చిన్నారులతో కలిసి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారంద గార్గేయపురం గ్రామానికి చెందిన రాజేశ్వరి (35) తన ఇద్దరు పిల్లలు అబ్రహం (3), సుకుమార్ (6)తో కలిసి గ్రామ చెరువులో దూకి ప్రాణాలు తీసుకుంది. కుటుంబ కలహాల కారణంగా రాజేశ్వరి కొంతకాలంగా తన పుట్టింట్లోనే ఉంటున్నట్లు సమాచారం.భర్తతో ఉన్న మనస్పర్థలు, కుటుంబ సమస్యల నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురైన రాజేశ్వరి ఈ దారుణ నిర్ణయం తీసుకున్నట్లు గ్రామస్థులు భావిస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్థుల సహాయంతో చెరువులో నుంచి మృతదేహాలను వెలికితీశారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబ కలహాలే ఈ విషాదానికి కారణమై ఉండొచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు.

# జనసేన పార్టీ 13 వ ఆవిర్భావ దినోత్సవం లో చిప్పగిరి మండల కన్వీనర్ కె.చిరంజీవి




**చిప్పగిరి, మార్చి ,14, (రిపబ్లిక్ న్యూస్ )** ఆలూరు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు శనివారం జనసేన పార్టీ 13 వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగిందని చిప్పగిరి మండల జనసేన కన్వీనర్ కె.చిరంజీవి తెలిపారు, విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆలూరు జనసేన పార్టీ కో ఆర్డినేటర్ రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారని, పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని సంస్థలలో ఏ రకమైన అవినీతి నైనా ప్రశ్నించడం ,మరియు ప్రజల ప్రాథమిక హక్కులను పరిక్షించడం జనసేన పార్టీ ప్రధాన లక్ష్యమని చెప్పారు,ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సరోజమ్మ , ఉచిరప్ప, భాషా ,
ఈ కార్యక్రమాల్లో మండల మరియు గ్రామ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, , జనసైనికులు ,తదితరులు పాల్గొన్నారు అని మండల కన్వీనర్ కె.చిరంజీవి తెలిపారు.

# రాజధానిలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు

### అమరావతి గ్రామాల్లో పర్యటించిన మంత్రి నారాయణ

**అమరావతి,మార్చి14: ):**అమరావతిలోని ఆయా గ్రామాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఏపీ మంత్రి నారాయణ వ్యాఖ్యానించారు. ఈ పనులు ప్రారంభించిన ఆరు నెలల్లోనే పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో అండర్ గ్రౌండ్ వాటర్, స్టామ్ వాటర్, వీధి దీపాలు, సిమెంట్ రోడ్లు వేస్తామని తెలిపారు. శనివారం అమరావతిలోని అనంతవరం, నెక్కలు గ్రామసభల్లో మంత్రి నారాయణ, స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, సీఆర్డీఏ అధికారులు పాల్గొన్నారు. గ్రామాల్లో కల్పిస్తున్న మౌలిక సదుపాయాల గురించి గ్రామ ప్రజలకు వివరించారు. గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ ప్రసంగించారు. మౌలిక సదుపాయాల కల్పనపై, గ్రామసభల నిర్వహణపై దృష్టిపెట్టామని చెప్పుకొచ్చారు. ఏపీ రాజధాని అమరావతి నిర్మాణంలోని పనుల్లో ప్రస్తుతం 30 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది జూన్ నాటికి అధికారులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నివాసాలు పూర్తి అవుతాయని స్పష్టం చేశారు. 2027 జూన్ నాటికి రాజధానిలో 360 కిలోమీటర్ల ట్రంక్ రోడ్డు,1500 కిలోమీటర్ల లేట్ అవుట్ రోడ్లు పూర్తి అవుతాయని వెల్లడించారు. అమరావతిలో శరవేగంగా ఐకానిక్ భవనాల పనులు జరుగుతున్నాయని తెలిపారు. 2028 డిసెంబర్ నాటికి ఐకానిక్ భవనాలు పూర్తి అవుతాయని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

---------------

# విజయవంతంగా కొనసాగుతున్న ఎముకలు, కీళ్ల ఉచిత వైద్య శిబిరం

- జి.ఎస్.ఆర్. ఆసుపత్రిలో గత నెల 18వ తేదీ నుండి ఎముకలు, కీళ్ల ఉచిత ఓ.పి.డి. సేవలు అందిస్తున్న డాక్టర్ మహమ్మద్ రఫీ

. రంజాన్ మాసం పురస్కరించుకుని నెల రోజుల ఉచిత సేవలు

. ఈనెల 20వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుంది: డాక్టర్ మహమ్మద్ రఫీ.



**నంద్యాల మార్చి 14 (రిపబ్లిక్ న్యూస్) :** నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో, పద్మావతి నగర్ మెయిన్ రోడ్డులో ఉన్న జి ఎస్ ఆర్ ఆసుపత్రిలో ప్రముఖ ఎముకలు, కీళ్ల శస్త్ర చికిత్స నిపుణులు, నంద్యాల ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ రఫీ రంజాన్ మాసం పురస్కరించుకుని గత నెల 18వ తేదీన ప్రారంభమైన ఉచిత ఎముకలు, కీళ్ల ఓ.పి.డి. చికిత్సలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు గత 24 రోజులలో 18 వందల మందికి ఉచితంగా ఓ.పి. వైద్య సేవలు డాక్టర్ మహమ్మద్ రఫీ అందించారు. శస్త్ర చికిత్సలు అవసరమైన 40 మంది అర్హత కలిగిన రోగులకు ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఆపరేషన్లు ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ వరకు ఈ ఉచిత సేవలు కొనసాగిస్తామని తెలిపారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, ఐఎంఏ కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ రవి కృష్ణ,రాష్ట్ర ఐఎంఏ సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్,రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన రెడ్డి,డాక్టర్ అనిల్ కుమార్,డాక్టర్ విజయభాస్కర రెడ్డి,ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్,మాజీ అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు మాట్లాడుతూ డాక్టర్ మహమ్మద్ రఫీ నెల రోజులు పైగా ఉచిత వైద్య సేవలు అందించడం ప్రశంసనీయం, స్ఫూర్తిదాయకం అన్నారు.

# ఇఫ్తార్ విందులో పాల్గొన్న గువ్వల రమేష్ రెడ్డి



**చౌడేపల్లి ప్రతినిధి మార్చి 14 రిపబ్లిక్ న్యూస్**

మండలంలోని దుర్గ సముద్రం పంచాయతీ, దాదేపల్లిలో జరిగిన ముస్లింల ఇఫ్తార్ విందులో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి పాల్గొన్నారు. గ్రామ ముస్లింలు రంజాన్ పండుగను పురస్కరించుకుని ఇఫ్తార్ విందుకు ఆయనను ఆహ్వానించారు.ముస్లిం పద్ధతిలో వస్త్రధారణ చేసి విందులో పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు అనంతరం ఆయన ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపి ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎం.డి గని , అమిత్ ఖాన్ గ్రామస్తులు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం

**చౌడేపల్లి ప్రతినిధి మార్చి 14 రిపబ్లిక్ న్యూస్**



మండల కేంద్రమైన చౌడేపల్లిలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు కోల సోమశేఖర్ జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ ను కట్ చేసి పంచిపెట్టారు. పుంగనూరు నియోజకవర్గంలో జనసేన పార్టీ సభ్యత్వాల దామోదలో ముందంజలో ఉందని ఇదే ఉత్సాహంతో 15 వేల వరకు చేయాలని పార్టీ కేడర్ను కోరారు. స్వాతంత్రం సిద్ధించిన 79 సంవత్సరాల తర్వాత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాలలోని ప్రజలకు నీరు నీడ దారి అందించిన ఘనత దక్కిందన్నారు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు ప్రతి జన సైనిక వీరనారీలు పార్టీ ఆవిర్భావ దినోత్సవం లో పాల్గొన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పుంగనూరు సింగిల్ విండో అధ్యక్షుడు పగడాల రమణ, జనసేన పార్టీ మండల నాయకులు మనేర్ హేమంత్ కుమార్, గందోడి చరణ్,శ్రీకాంత్,పురుషోత్తం , నరేష్, శేషాద్రి, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలకు ఆరోగ్య పరీక్షలు



**చౌడేపల్లి ప్రతినిధి మార్చి 14 రిపబ్లిక్ న్యూస్**

చౌడేపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడి కార్యకర్తలు ఆయాలకు ఆరోగ్య పరిక్షలు నిర్వహించారు. శనివారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి మోనా అంగన్వాడి కార్యకర్తలు ఆయాలకు వైద్య పరీక్షలు నిర్వహించారు అంగన్వాడీలు ఆరోగ్యవంతంగా ఉన్నప్పుడే చిన్నారుల పట్ల శ్రద్ధ వహిస్తారని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు సులోచన,రాధ మండలంలోని అంగన్వాడీలు పాల్గొన్నారు.

# గురురాజాలో అట్టహాసంగా ప్రీ నర్సరీ ముగింపు వేడుకలు






**నంద్యాల మార్చి 14 ( రిపబ్లిక్ న్యూస్) :**

పట్టణం ఎన్జీవో కాలనీలోని శ్రీ గురు రాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు రెండున్నర సంవత్సరాలు నిండిన చిన్నారులకు ప్రీ నర్సరీ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు వేడుకలకు శ్రీ గురురాజా పాఠశాల గౌరవ సలహాదారులు పి. సింధు , పి. రేవతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రీ నర్సరీ చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చిన్నారుల విచిత్ర వేషధారణలు, దేశ నాయకుల ఫ్యాన్సీ డ్రెస్, రైమ్స్ స్టోరీస్, నంబర్ గేమ్స్, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు, ఫ్యాషన్ షోలు ఇలా వివిధ రకాల కార్యక్రమాలతో విద్యార్థుల ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు ఆడుతూ, పాడుతూ ప్లే వే మెథడ్ లో యాక్టివిటీ బేస్డ్ విధానంలో ప్రీ నర్సరీ ఉపాధ్యాయుల శిక్షణ అందించగా విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమానికి స్కూల్ గౌరవ సలహాదారులు సింధు , రేవతి ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బహుమతులను అందజేశారు. విద్యార్థుల ప్రతిభ పాటలను అభినందించారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నంద్యాలలో రెండు రోజుల టీవీ టెక్నీషియన్ శిక్షణా శిబిరం ప్రారంభం

. ఎస్.ఆర్.ఎం. విశ్వవిద్యాలయ సహకారంతో . శిక్షణ శిబిరం ప్రారంభించిన డాక్టర్ రామకృష్ణారెడ్డి ,డాక్టర్ రవి కృష్ణ,

. టీవీ టెక్నీషియన్స్ సద్వినియోగం చేసుకోవాలి: మధుసూదన రెడ్డి,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలక్ట్రానిక్, టీవీ టెక్నీషియన్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు

. నంద్యాల జిల్లా టీవీ టెక్నీషియన్ అసోసియేషన్ నిర్వహణలో. శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న నిపుణులు సయ్యద్ ఇక్బాల్

**నంద్యాల మార్చి 14( రిపబ్లిక్ న్యూస్) :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలక్ట్రానిక్, టీవీ టెక్నీషియన్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో, అమరావతి ఎస్.ఆర్.ఎం. విశ్వవిద్యాలయ సహకారంతో,నంద్యాల జిల్లా టీవీ టెక్నీషియన్ అసోసియేషన్ నిర్వహణలో శనివారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల స్వామి వివేకానంద ఆడిటోరియంలో నంద్యాల జిల్లా టివి టెక్నీషియన్లకు రెండు రోజుల సాంకేతిక శిక్షణా తరగతుల శిబిరం ఘనంగా ప్రారంభమైంది.

ఈ సందర్భంగా రాష్ట్ర ఎలక్ట్రానిక్, టీవీ టెక్నీషియన్ అసోసియేషన్ అధ్యక్షులు మధుసూదన రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, నంద్యాల జిల్లా టీవీ టెక్నీషియన్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న నిపుణులు సయ్యద్ ఇక్బాల్ అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజలను చేసి శిక్షణ శిబిరం ప్రారంభించారు. ముందుగా టీవీ ని కనుగొన్న బైర్డ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.



ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ టీవీ సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను తెలుసుకోవడం ద్వారా తమ నైపుణ్యాలను పెంచుకోవడానికి టీవీ టెక్నీషియన్ కి ఇది గొప్ప అవకాశం అన్నారు.

డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక నైపుణ్య శిక్షణ పొంది టీవీలు రిపేర్ కి వచ్చినప్పుడు లోపం ఎక్కడుందో సరిగా గుర్తించి, సత్వరమే తయారు చేసి ఇవ్వడం ద్వారా టెక్నీషియన్స్ పై ప్రజలకు విశ్వాసం పెరుగుతుందన్నారు. టీవీ టెక్నీషియన్ అసోసియేషన్ సభ్యుల కుటుంబాలకు మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరం నిర్వహిస్తామని, వారి సంక్షేమానికి, అభివృద్ధికి స్థానిక మంత్రి ఎన్.ఎం.డి.ఫరూక్ దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వ సహకారం అందేలా కృషి చేస్తామన్నారు.

టీవీ టెక్నీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షులు మధుసూదన రెడ్డి, నంద్యాల జిల్లా సంఘం అధ్యక్షులు కన్నయ్య మాట్లాడుతూ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో ముందుగా కర్నూలు, నంద్యాల జిల్లాలలో ప్రారంభించడం సంతోషకరమన్నారు.

శిక్షణ ఇస్తున్న సాంకేతిక నిపుణులు సయ్యద్ ఇక్బాల్ మాట్లాడుతూ టెలివిజన్ లు ఎప్పటికప్పుడు కొత్త సాంకేతికతతో రూపాంతరం చెందుతున్నాయని తదనుగుణంగా వాటి గురించి అవగాహన పెంచుకోవడం ప్రతి టీవీ టెక్నీషియన్ కి ఎంతో అవసరం అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీవీ టెక్నీషియన్ అసోసియేషన్ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి,శిక్షణ ఇస్తున్న సాంకేతిక నిపుణులు సయ్యద్ ఇక్బాల్,రాష్ట్ర అసోసియేషన్ కోశాధికారి రామకృష్ణారెడ్డి, నంద్యాల జిల్లా టీవీ టెక్నీషియన్ సంఘం అధ్యక్షులు కన్నయ్య, నంద్యాల టౌన్ సంఘం అధ్యక్షులు జయపాల్,ఆడియో విజువల్ సాంకేతిక నిపుణులు వెంకటేశ్వర రెడ్డి,ఎస్.ఆర్.ఎం. విశ్వవిద్యాలయ ప్రతినిధి సాగర్, సందీప్, శివ యాదవ్, వీరా రెడ్డి, రహీమ్ బైగ్, ఎల్లా గౌడ్ , , జిల్లా నలుమూలల నుండి వచ్చిన రెండు వందల మంది పైగా టీవీ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమం కోసం ఆవిర్భవించినదే జనసేన పార్టీ

- మారాసు గురు -జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అన్నదాన కార్యక్రమం






**నంద్యాల మాచి 14 (రిపబ్లిక్ న్యూస్) :**

పేదల కష్టాలను తీర్చి,వారి సంక్షేమానికి బాటలు వేసేందుకు ఆవిర్భవించినదే జనసేన పార్టీ అని నంద్యాల జనసేన పార్టీ నాయకులు మారాసు గురు బాబు, దండు మురళి ,అన్నారు జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నంద్యాలపట్టణంలోని శనివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు, అందులో భాగంగా నందమూరి నగర్ ఎస్ ఆర్ బి సి కాలనీలో ఉన్నటువంటి పరివర్తన లైఫ్ సెంటర్ నందు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన నంద్యాల జనసేన పార్టీ నాయకులు భవనాసి వాసు, మారాసు గురు బాబు, దండు మురళి, ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు భవనాసి వాసు మాట్లాడుతూ మా జనసేన పార్టీ అధినేత రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని అన్నారు ఈరోజు పట్టణంలో కూడా జనసేన పార్టీ జెండాను ఎగరవేసి ఆవిర్భావం సందర్భంగా కేక్ కటింగ్ మరియు అన్నదాన కార్యక్రమాలు కూడా చేపట్టామని ఇలానే ముందు ముందు కూడా జనసేన పార్టీ నంద్యాల జిల్లాలో మరింత బలపడుతుందని ఆశ భావం వ్యక్తం చేశారు ఈ పరివర్తన లైఫ్ సెంటర్లో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన జనసేన నాయకులు మారాసు గురుబాబు ,దండు మురళి ,కు హృదయపూర్వకధన్యవాదాలుతెలియజేశారు ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు మారాసు గురుబాబు మాట్లాడుతూ ఈరోజు జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మా అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈరోజు నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్ లో జనసేన పార్టీ నాయకులు భవనాసి వాసు ఆధ్వర్యంలో జనసేన పార్టీ జెండాను ఎగరవేసి ఘనంగా కేక్ కటింగ్ ను జనసైనికులు వీర మహిళలు కార్యకర్తలు మధ్య ఈ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవడం అనేది శుభపరిణామం అని అన్నారు అలానే మేము కూడా ఈ పరివర్తన లైఫ్ సెంటర్ నందు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ఇలానే ప్రతి ఆవిర్భావ దినోత్సవాలు నంద్యాల జిల్లాలో ఘనంగా నిర్వహిస్తామని పార్టీని కూడా బలోపేతానికి మా వంతుగా కలిసికట్టుగా ముందుకు వెళ్తామని తెలిపారు, ఈ సందర్భంగా జనసేన నాయకులు దండు మురళి కృష్ణ మాట్లాడుతూ జనం కోసం పేద ప్రజల కోసం సేవా కార్యక్రమాల కోసం పుట్టిన పార్టీ జనసేన పార్టీ అని తెలిపారు అలానే మా అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిరంతరం ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతూ రాష్ట్ర ప్రజల కోసం నిరంతరం పోరాడుతున్న పార్టీ జనసేన పార్టీ అని తెలిపారు ఇలానే ప్రతి సంవత్సరం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కలిసికట్టుగా ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు, అనంతరం ఈ కార్యక్రమంలో నంద్యాల జనసేన పార్టీ నాయకులు భవనాసి వాసు, మారాసు గురుబాబు, దండు మురళీకృష్ణ, నాగి వెంకటేశ్వర్లు, పరివర్తన సెంటర్ నిర్వాకుడు అబ్రహం పలువురు జనసేన నాయకులు ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం



# గుర్రపు డెక్కల నివారణకు ప్రత్యేక డ్రైవ్ ప్రారంభం

### నదుల్లో లార్విసైడ్ ఆయిల్, హైపో ద్రావణం పిచికారీ డ్రోన్ సహాయంతో చర్యలు: కమిషనర్ పి. విశ్వనాథ్







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 14)**
కర్నూలు నగర పరిధిలో గుర్రపు డెక్కల నివారణ కోసం నగరపాలక సంస్థ ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు కమిషనర్ పి. విశ్వనాథ్ తెలిపారు. శనివారం సంకల్‌బాగ్ సమీపంలోని తుంగభద్ర నదిలో జరుగుతున్న శుభ్రత పనులు, లార్విసైడ్ ఆయిల్ పిచికారీ కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పరిధిలో తుంగభద్ర, హంద్రీ, కేసీ కెనాల్ వంటి నదులు ఉన్నాయని చెప్పారు. నదుల్లో పిచ్చి మొక్కలు, చెత్త పేరుకుపోవడం వల్ల రోగకారక దోమలు పెరగడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ముందుగా శుభ్రత పనులు చేపట్టి, అనంతరం గుర్రపు డెక్కల నివారణ కోసం డ్రోన్ సహాయంతో లార్విసైడ్ ఆయిల్ పిచికారీ చేస్తున్నట్లు వివరించారు.
అదేవిధంగా హైపో ద్రావణాన్ని కూడా పిచికారీ చేసి దోమల వ్యాప్తిని నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో పది మంది సిబ్బంది, నాలుగు తెప్పలు, ఒక డ్రోన్ వినియోగిస్తున్నామని, రెండు వారాల్లో కార్యక్రమాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగ ప్రసాద్, డిఈఈ శ్రీనివాసన్, ఎంటమాలజిస్ట్ వెంకటేశ్వర్లు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అవుకు పట్టణ అభివృద్ధి పనులను ప్రత్యేకంగా పర్యవేక్షించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి



**అవుకు మార్చి 14 రిపబ్లిక్ (న్యూస్)**



అవుకు పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను శనివారం రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ప్రత్యేకంగా పర్యవేక్షించారు. పట్టణంలో కొనసాగుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పట్టణంలో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులను నాణ్యతతో పాటు సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి ఆలస్యం లేకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. అలాగే పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారుద

# ఉగాది బ్రహ్మోత్సవాలకు బందోబస్తు నిమిత్తం వచ్చిన అధికారులకు మరియు సిబ్బందికి మార్గనిర్దేశం చేసిన జిల్లా ఎస్పీ








**నంద్యాల ప్రతినిధి, మార్చి 14,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
గుడి లోపలికి ప్రవేశించే ప్రతి మార్గంలో ఐఖీవీఐ లను ఏర్పాటు చేయాలి. ప్రతి ఒక్కరిని తనిఖీ చేసి లోపలికిఅనుమతించండి. జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ ఖూా నంద్యాల జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం నందు ఉగాది బ్రహ్మోత్సవాలు జరగనున్న సందర్భంగా బందోబస్తు నిమిత్తం వివిధ జిల్లాల సుమారు 300 మంది సాయుధ బలగాలను అనగా ఆూూూ ,ూా=, స్పెషల్ పార్టీ లను శ్రీశైలం పోలీస్ స్టేషన్ నందు సమావేశ పరిచి బందోబస్తులో నిర్వహించవలసిన విధుల గురించి నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ ఖూా దిశా నిర్దేశం చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ముందుగా సిబ్బందితో మాట్లాడుతూ మీకు ఏర్పాట్లు చేసిన వసతిలో గాని భోజన సదుపాయాలలో కానీ మరే ఇతర కారణాలలోనైన అసౌకర్యం కలిగిన వాట్సాప్ గ్రూప్ లో నేరుగా తెలియజేయవచ్చు.
బందోబస్తుకు వచ్చిన సిబ్బంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విధులు నిర్వహించాలి.
గుడి లోపలికి ప్రవేశించు మార్గాలలో తప్పనిసరిగా డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్ (ఐఖీవీఐ )ను ఉపయోగించాలి.
సాధారణ భక్తులనుండి ఉన్నత స్థాయి అధికారుల వరకు ప్రతి ఒక్కరిని తనిఖీ (ఫ్రిస్కింగ్) చేసి లోపలికి అనుమతించాలి.
శ్రీశైలం పరిసర ప్రాంతాలలో రోడ్డు ఓపెనింగ్ పార్టీ (=ూా) లు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలి.
స్పెషల్ పార్టీ బృందాలు శ్రీశైలం పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలి.
మీకు రిలీవ్ వచ్చేవరకు అప్పగించిన డ్యూటీ ప్రదేశాన్ని వదిలి వెళ్లరాదు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలి. ఏదైనా సమస్య ఉంటే ఉన్నతాధికారులకు తెలియజేయాలని జిల్లా ఎస్పీ గారు మార్గనిర్దేశం చేయడం జరిగింది

# జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం

**అవుకు మార్చి 14 రిపబ్లిక్ (న్యూస్)**




అవుకు జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బనగానపల్లె నియోజకవర్గ సమన్వయకర్త భాస్కర్ అన్న గారి సహకారంతో అవుకు మండలంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జనసేన పార్టీ అవుకు మండల అధ్యక్షుడు అజిత్ రెడ్డి మరియు ఉపాధ్యక్షుడు జనార్దన్ గారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా అవుకు మండల టీడీపీ అధ్యక్షులు ఉగ్రసేనారెడ్డి గారు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రక్తదాతలను అభినందిస్తూ రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడే గొప్ప సేవ చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి శిబిరాన్ని విజయవంతం చేశారు


# కళ్ళ చికిత్సలో కనికట్టు




కంటి చికిత్స కోసం వచ్చిన వన్నూరు కు వైద్యులు అందజేసిన ప్రైవేట్ దుకాణాల స్లిప్పులను చూపుతున్న దృశ్యం




## నయనం ప్రధానం
## ప్రపంచ రంగోలి చూడాలి అంటే కళ్ళు ఉండాలి
## కంటి చూపు ఉండాలి




వంద్రమ్మకు తిరుపతి అడ్రస్ తో ఉన్న స్లిప్పును అందజేసిన వైద్యులు




కంటి చికిత్స విభాగంలో రోగులకు అందజేస్తున్న ప్రవేట్ దుకాణాల స్లిప్

**రిపబ్లిక్ క్రైమ్, మార్చి 14, అనంతపురం**
పెద్దాసుపత్రి కళ్ళ చికిత్సలో వైద్యులు కనికట్టు చేస్తున్నారు. ప్రైవేట్ షాపులనుతో కబమీషన్లకు కక్కుర్తి పడి చికిత్సలు చేస్తున్నారు. అద్దాలు, మందులు ఆకాశాన్ని అంటుతున్న ధరలు. పేదలు వాటిని కొనుగోలు చేయలేక తలకు మించిన భారంగా మారింది. అనంతపురం సర్వజన ఆసుపత్రిలో నేత్ర వైద్యులు అన్నీ మాయ చేస్తున్నారు. కంటి పరీక్షలు తప్ప ప్రతిది బయటే కొనుగోలు చేయాలని స్లిప్పులు రాసిస్తున్నారు. డాక్టర్లకు అనుకూలంగా ఉన్న మందుల షాపులకు కళ్ళద్దాల షాపులలో కొనుగోలు చేయాలని రోగులకు మెలిక పెడుతున్నారు. చేసేది ఏమీ లేక చాలామంది రోగులు డాక్టర్లు చెప్పినట్లే తలాడిస్తున్నారు. కాసులకు కక్కుర్తి పడుతున్న డాక్టర్లు ఆపరేషన్లు సైతం ప్రైవేట్ ఆసుపత్రిలోనే కానిచ్చేస్తున్నారు. ఈ తంతు బహిరంగంగా తెలిసినా అటు ప్రజాప్రతినిధులు ఇటు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిర్లిప్తత ప్రదర్శిస్తున్నారు. సర్వజన ఆసుపత్రిలో ఆధునిక వైద్య సేవలు ఉన్నప్పటికీ కళ్ళజోళ్ళు కూడా ఇవ్వలేని దారుణ పరిస్థితి నెలకొంది. పేరుకే పెద్దాసుపత్రి సౌకర్యాలు మాత్రం అరకొరగా ఉన్నాయి. ప్రభుత్వ సౌకర్యాలు ఉన్నప్పటికీ ప్రైవేటు కంటి ఆసుపత్రికి మొగ్గు చూపుతున్నారు. కారణం అన్ని బయటికి రాసిస్తున్నందునే బయట ప్రైవేట్ ఆసుపత్రులకు వెళుతున్నారు.

### చికిత్సల కోసం వచ్చిన రోగాలను విచారిస్తే..

అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామానికి చెందిన కె.వంద్రమ్మ (62) భర్త వన్నప్ప కూలి పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. అయితే ఆమె 3 సంవత్సరాల వయసు ఉన్నప్పుడు అమ్మవారు (తట్టు) పోసి తన రెండు కళ్ళు చూపు కోల్పోవడం జరిగిందని, అయితే మొదట ఎడమ కన్ను, తర్వాత రెండవ కన్ను
ఇలా రెండు దపాలలో రెండు కండ్లను పోగొట్టుకున్నానని ఆవేదన చెందింది. అయితే ఒక తెల్ల కాగితంపై
కంటి విభాగంలోని వైద్యులు అరవింద్ ఆసుపత్రి చిరునామా రాసి ఆమెకు అందించారు. అయితే



కంటి చికిత్స విభాగంలో మధ్యాహ్నం 12:37 గంటలపై అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్న దృశ్యం

సుదూర ప్రాంతమైన తిరుపతికుపోవడం తమకు కష్టంతో కూడుకున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రాను పోను ఖర్చులు, తనతోపాటు ఒకరిద్దరు కూడా వెళ్లాల్సి వస్తుందని ఆమె బాధ వెలబుచ్చారు.
అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం రేకులకుంట గ్రామానికి చెందిన వన్నూరు (47) కంటి పరీక్షల కోసం వచ్చానని, పరీక్షల అనంతరం వైద్యులు మందులు ఇవ్వకుండా కళ్లద్దాల స్లిప్పులను రాసి తమకు అందజేశారని తెలిపారు. ఒక్కో కళ్ళజోడు రూ.1200 నుంచి రూ.1500 వరకు ఉంటుందని తెలిపారు. అంత ఖర్చు చేసి కళ్ళజోళ్ళు కొనలేని పరిస్థితిలో ఉన్నానన్నారు.
ఇలా స్లిప్పులను రాసి తమకు అందజేస్తున్నారని, ఇలా రాసి ఇవ్వడం వెనుక ఆంతర్యం ఏమిటో అర్థం కాలేదన్నాడు. రోగికి కళ్ళజోడు అవసరమని తెలిపితే.. వారికి నచ్చిన చోట నచ్చిన ధరలో తీసుకుంటారని సమాధానం ఇచ్చాడు.

### ప్రైవేట్ దుకాణాలకు కోట్లలో సంవత్సర ఆదాయం

కంటి పరీక్షల అనంతరం చాలా మందికి వెంటనే కళ్లద్దాలు అవసరమని చెప్పి, కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి ఆసుపత్రి వెలుపల ఉన్న కొన్ని ప్రైవేట్ కళ్లద్దాల దుకాణాలకు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రైవేట్ స్లిప్పులను ఇచ్చి పంపుతున్నారు. దీంతో ఆ ప్రాంతంలో కళ్లద్దాల వ్యాపారం జోరుగా సాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఒక్కో కళ్ళజోళ్ళ ధర



కంటి చికిత్స కోసం వచ్చిన వంద్రమ్మ కు తిరుపతి అడ్రస్ తో ఉన్న స్లిప్పును వైద్యులు అందజేసిన దృశ్యం

రూ.1200 నుంచి
రూ.1500 వరకు పలుకుతుంది. రోజుకు
100 నుంచి 150 మంది వరకు రోగులు కంటి పరీక్షల కోసం ప్రభుత్వాసుపత్రికి వస్తున్నారు. దీంతో దాదాపుగా 15 మంది నుంచి దాదాపు 25 మంది రోగులకు కళ్లద్దాలు అవసరమని చెబుతుండడంతో రోగులు 25 మందికి గాను
రోజుకు రూ.35,500 రూపాయలు రోగులు ఖర్చు చేస్తున్నడంతో వారికి అధిక భారం అవుతోంది. రోజుకు రూ 35 వేల 500 వందల రూపాయలు చొప్పున నెల మొత్తానికి దాదాపుగా రూ.11,25000 లక్షల రూపాయలు రోగులు ఖర్చు చేస్తున్నారు. రోగులనుంచి కళ్ళజోళ్ళ దుకాణాలు సంవత్సర ఆదాయాన్ని కోట్లలో దండుకుంటున్నారు. ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు చేయలేక రోగులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో రోగులకు అవసరమైన కళ్లద్దాలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందించే సౌకర్యం లేకపోవడం కూడా సమస్య మరింత పెరుగుతోంది.

### ఆపరేషన్ల ఖర్చులు అధికం .. రోగులకు ఇబ్బంది కరం

కొంతమంది రోగులకు అవసరమైన కంటి ఆపరేషన్ల విషయంలో కూడా ప్రభుత్వ ఆసుపత్రి కన్నా ప్రైవేట్ ఆసుపత్రులను వెళ్లే విధంగా వైద్యులు సూచిస్తున్నారన్న ఆరోపణలు నెలకొన్నాయి. దీంతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగులు చివరికి ప్రైవేట్ ఆసుపత్రులకు వైపు వెళ్లాల్సి వస్తోంది.
ఆపరేషన్ల ఖర్చులు అధికంగా ఉండటంతో పేద కుటుంబాలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాయి. దీంతో ప్రభుత్వ ఆసుపత్రులకు రోగులు వచ్చినప్పటికీ కూడా అధిక భారం పడుతుండడం గమనార్హం.

### మందులు బయట మెడికల్ షాపుల నుంచి కొనుగోలు

కంటి పరీక్షలు అనంతరం రోగులకు మందులను అందజేయాల్సి ఉంది. అయితే కేవలం పరీక్షలు చేసి కళ్ళజోళ్ళు తీసుకోమని చెబుతుండడం గమనార్హం.
రోగులు చికిత్సల అనంతరం మందులు దేవుడు కెరుక..
అయితే రోగులకు కళ్లద్దాలను తీసుకోవాలని
కంటి పరీక్షల విభాగంలో ప్రత్యేకించి ప్రైవేట్ కళ్లజోళ్ల దుకాణాల స్లిప్పులను రోగులకు ఇవ్వడం ఎంతవరకు సమంజసం. ప్రత్యేకించి వచ్చిన ప్రతి రోగికి ప్రైవేట్ దుకాణాల స్లిప్పులను ఇచ్చి కళ్ళజోళ్లను కొనాలంటున్నాడు. దీంతో ప్రభుత్వ ఆసుపత్రులకు సరఫరా చేసే మందులు రోగులకు అందుతున్నాయా లేదా అన్న సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో మందులు అందుబాటులో లేక రోగులు బయట మెడికల్ షాపుల నుంచి కొనుగోలు చేయాల్సి వస్తోందని సమాచారం. దీంతో ప్రభుత్వ అందించే మందులు నిజంగా రోగులకు చేరుతున్నాయా అనే ప్రశ్నలు ఎన్నో .

### మధ్యాహ్నం 12:37 గంటల పైన ఖాళీ కుర్చీలు


పెద్దాసుపత్రిలో ఆధునిక వైద్య పరికరాలు, సదుపాయాలు ఉన్నప్పటికీ వాటి పూర్తి ప్రయోజనం రోగులకు అందడం లేదన్న విమర్శలు వెళ్ళు వెత్తుతున్నాయి. పేరుకే పెద్దాసుపత్రిఉ కానీ రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలు మాత్రం అంతంత మాత్రమేనని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందులో భాగంగానే ..కంటి విభాగంలో పనిచేస్తున్న ప్రొఫెసర్ రెండు నెలలుగా ట్రైనింగ్ లో ఉన్నారు. దీంతో అసిస్టెంట్ ప్రొఫెసర్లు మాత్రం విధులకు డుమ్మా కొడుతున్నారు. మధ్యాహ్నం



కంటి పరీక్షల విభాగంలో కనిపిస్తున్న ఖాళీ కుర్చీ

12:37 గంటల పైన ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. విధులలో పనిచేయాల్సిన అసిస్టెంట్ ప్రొఫెసర్లే ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఇక రోగుల పరిస్థితి ఏంటో అర్థం కాని పరిస్థితి సర్వజన ఆసుపత్రిలో నెలకొంది. కంటి వైద్య విభాగంలో కంటి పరీక్షలు నిర్వహించే గదిలో ఓ కంటి నిపుణుడు మధ్యాహ్నం 12:41 గంటలకు విధులను నిర్వర్తించకుండా
ఉన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. దీంతో కంటి పరీక్షల విభాగంలో ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు విధులను నిర్వహిస్తున్నారు.
ఇంత జరుగుతున్నా కూడా పర్యవేక్షణ లేకపోవడం గమనార్హం. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు మాత్రం ఈ వ్యవహారంపై స్పందించకపోవడంతో విమర్శలకు దారి తీస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగే ఈ తరహా వ్యవహారాలపై ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పెద్ద ఆసుపత్రి ఓపి స్లిప్



# దుష్ప్రచారం, వ్యక్తిత్వ హననమే చంద్రబాబు అజెండా..

## - బాబు అబద్ధాలకే కేరాఫ్ అడ్రస్.. - 40 ఏళ్ల రాజకీయ అనుభవమని చెప్పుకుంటున్న మీరు ఒక్క మంచి పనైనా చేశారా.. గడికోట శ్రీకాంత్ రెడ్డి

**ఏపీ బ్యూరో, మార్చి 14 - (రిపబ్లిక్ న్యూస్) -**
వైయస్ఆర్ కడప జిల్లా వైసీపీ కార్యాలయంలో శనివారం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గడికోట శ్రీకాంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.
అప్పుల్లో రికార్డు.. హామీల్లో సున్నా..
కూటమి ప్రభుత్వానిది పచ్చి మోసం..
రాయలసీమ ద్రోహి చంద్రబాబే..
సీమ కడుపు కొట్టి పచ్చి అబద్దాలా..
హెరిటేజ్ బినామీల కోసం నెయ్యి ధరల పెంపు..
భక్తుల సొమ్ముతో వేల కోట్ల దోపిడీ..
ఇది కల్తీ కూటమి ప్రభుత్వమని
గడికోట శ్రీకాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సుదీర్ఘ అనుభవముందని చెప్పుకుంటున్న సీఎం చంద్రబాబు నాయుడు తన అనుభవాన్ని రాష్ట్ర శ్రేయస్సు కోసం కాకుండా, కేవలం ప్రత్యర్థులపై బురద జల్లడానికే ఉపయోగిస్తున్నారని గడికోట శ్రీకాంత్ రెడ్డి విమర్శించారు. శనివారం కడపలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందని అడ్డగోలుగా ఆరోపణలు చేసి కోట్లాది మంది భక్తుల మనోభావాలను చంద్రబాబు దెబ్బతీశారని శ్రీకాంత్ రెడ్డి మండిపడ్డారు.

**భక్తిని కేవలం ఓట్ల కోసం వాడుకోవడం చంద్రబాబుకే చెల్లు..**
“సుప్రీం కోర్టు ఆదేశాలతో సిట్ విచారణలో జంతు కొవ్వు లేదని తేలిన తర్వాత కూడా, బాత్‌రూమ్ కెమికల్స్ కలిసాయంటూ మాట్లాడటం రాజకీయాలకు నిదర్శనమని మతాన్ని, భక్తిని కేవలం ఓట్ల కోసం వాడుకోవడం చంద్రబాబుకే చెల్లిందని విమర్శించారు. రాయలసీమ ప్రాంతానికి వచ్చినప్పుడల్లా వైయస్ వివేకానంద రెడ్డి హత్య గురించి మాట్లాడే చంద్రబాబు రెండేళ్లుగా అధికారంలో ఉండి ఎందుకు నిజాన్ని నిరూపించలేక పోతున్నారని నిలదీశారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుతో పాటు, హైకోర్టును సీమకు రాకుండా అడ్డుకున్న చంద్రబాబే రాయలసీమ ద్రోహి అని మండిపడ్డారు.

**తిరుమల పరిధిలోని ఏడుకొండలుగా నిర్ధారణ..**
తిరుమల పరిధిని ఏడు కొండలుగా నిర్ధారిస్తూ వైయస్ఆర్ జీవో ఇస్తే, నాడు దానిని రద్దు చేస్తానన్న చంద్రబాబు నేడు తానే హిందూ ధర్మ పరిరక్షకుడినని చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. ఇచ్చిన హామీల అమల్లో పూర్తిగా విఫలమైన చంద్రబాబు తప్పుడు ప్రచారాలతో డైవర్షన్ పాలిటిక్స్ కు పాల్పడుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు ప్రచార పిచ్చి వల్ల అనేక మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారని శ్రీకాంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి పుష్కరాలు, తిరుమల, సింహాచలం తొక్కిసలాట మరణాల నుంచి నిన్నటి కదిరి నర్సింహస్వామి రథయాత్ర వరకు జరిగిన ప్రతి తొక్కిసలాటకూ చంద్రబాబు నిర్లక్ష్యమే కారణమన్నారు. ఇప్పటికైనా అబద్ధాల రాజకీయం ఆపి, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేనిపక్షంలో ప్రజలు చంద్రబాబుకు తగిన బుద్ధి చెబుతారని గడికోట శ్రీకాంత్ రెడ్డి హెచ్చరించారు.

**నాలుగు దశాబ్దాల్లో ఒక్క మంచి పనీ చేయని చంద్రబాబు..**
తిరుమల లడ్డూ అంశం, వివేకానందగారి హత్యతో పాటు గత ప్రభుత్వ అప్పులు, వ్యవసాయం, నీటిపారుదలశాఖ ఇలా అన్నింటిలోనూ అబద్దాలు చెప్పడం చంద్రబాబుకు




పరిపాటిగా మారింది. వాస్తవాలు చెప్పడం చంద్రబాబు చరిత్రలోనే లేదు. నిత్యం ఇతరుల వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ దాన్నే ఓటు బ్యాంకుగా మార్చుకోవడమే చంద్రబాబు అజెండా. ఇన్నేళ్ల పాటు సీఎంగా చేసినా ఫలానా అంశంలో రాష్ట్రచరిత్రలో నా పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని చెప్పుకోవడానికి ఒక్కటంటే ఒక్క పని కూడా చేపట్టలేదు. ప్రజలు ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది.

**పచ్చి అబద్దాలు - అడ్డగోలు ఆరోపణలు..**
బాధ్యతాయుతమైన సీఎం స్థానంలో ఉండి కూడా ఆధారాల్లేకుండా తిరుపతి లడ్డూలో జంతుకొవ్వు, పందికొవ్వు కలిసిందని పదే, పదే నోటికొచ్చినట్లు మాట్లాడారు. సున్నితమైన మత విద్వేషాలను రెచ్చగొట్టడం ద్వారా గొడవలు సృష్టించి, మిగిలిన వర్గాలను కేవలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చేయాలన్న దురుద్దేశ్యంతో ఇదే అంశంపై పదేపదే మాట్లాడారు. దీనిపై ప్రజలకు వాస్తవాలు తెలియాలి. ప్రజల మనోభావాలు, భగవంతుడికి సంబంధించిన అంశం కావడంతో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేరుగా సుప్రీం కోర్టునే ఆశ్రయించింది. కోర్టు ఆదేశాలతో సీబీఐ ఆధ్వర్యంలోని సిట్ లడ్డూ ప్రసాదంలో ఎలాంటి జంతు కొవ్వు లేదని నిర్ధారించిన తర్వాత కూడా బాత్రూమ్ కెమికల్స్ ప్రసాదంలో కలిసాయంటూ మాట్లాడ్డం చంద్రబాబుకి దేవదేవుడి మీద ఉన్న విశ్వాసం ఏపాటిదో స్పష్టమవుతుందని శ్రీకాంత్ రెడ్డి విమర్శించారు. బాధ్యతా యుతమైన పదవిలో ఉన్న వ్యక్తి చివరకు మతాన్ని, కులాన్ని ఓన్ చేసుకోవాలన్న ఆలోచన దురదృష్టకరం. మతపరమైన విశ్వాసాలు అందరికీ ఉన్నాయి. కానీ చంద్రబాబు మాత్రం తనకే ఉన్నట్టు ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తుంటాడు. ఈ తరహా వ్యవహారశైలితో కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి.

**ఉమ్మడి రాష్ట్రాల్లో ఉన్న 19 ఆలయాల్లో అన్యమత ప్రచారం జరగకుండా జీవోలు..**
దేవదేవుడిమీద నమ్మకంతో కేంద్ర అటవీశాఖకు లేఖ రాసి మరీ అన్ని అనుమతులు తీసుకొచ్చి రెండు కొండలుగా ఉన్న తిరుమల పరిధిని ఏడు కొండలగా నిర్ధారిస్తూ దివంగత నేత స్వర్గీయ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర రెడ్డి జీవో జారీ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న 19 దేవస్థానాల్లో అన్యమత ప్రచారం చేయకుండా నిరోధించేందుకు ఏకంగా జీవోలు జారీ చేశారు. కానీ ఇదే చంద్రబాబు 2009 ఎన్నికల్లో గెలుపుకోసం వైయస్ఆర్ హయాంలో ఇచ్చిన రెండు జీవోలను రద్దు చేస్తానని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చి ఇవాళ మాట మారుస్తూ ఎదుట వాళ్లపై బురద జల్లే కార్యక్రమం చేస్తున్నాడు. రాయలసీమ ప్రాంతానికి వచ్చినప్పుడల్లా సభల్లో వైయస్ జగన్ తన బాబాయిని చంపాడంటూ చంద్రబాబు సిగ్గులేకుండా మాట్లాడుతున్నాడు. ఆ కుటుంబంలో చిచ్చు పెట్టాడు. గొడ్డలితో వివేకానందరెడ్డిని నరికి చంపామని స్వయంగా అంగీకరించిన వ్యక్తులను కేవలం తన రాజకీయ లబ్ధి కోసం అప్రూవర్లుగా మార్చి, దాదాగిరి చేసుకొమ్మని వారిని సొసైటీలో వదిలిపెట్టడంతో పాటు హత్యతో సంబంధం లేని వారిని జైల్లో పెట్టి హింసించిన చరిత్ర చంద్రబాబుది. అయినా చంద్రబాబు పగ చల్లారలేదు.

**అధికారం నీదే దమ్ముంటే నిరూపించు బాబూ..**
ఈ కేసు గురించి వైయస్ జగన్ పై పదే పదే విమర్శనలు చేసిన చంద్రబాబు అధికారంలోకి వచ్చి రెండేళ్లయింది. చంద్రబాబూ మీ చేతిలో అధికారం ఉంది. మీ మద్ధతుతో కేంద్రప్రభుత్వం నడుస్తోంది. మీకు దమ్ముంటే వాస్తవాలు బయట పెట్టండి. సుప్రీం కోర్టు కూడా మీరు ఈ కేసును ట్రాక్ చేస్తున్నారని చెప్పింది. అయినా ఇంకా దాన్ని పెంచుకుంటూ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీపై బురద జల్లే కార్యక్రమం చేయడం దురదృష్టకరమన్నారు.

**పదే పదే తప్పుడు ఆరోపణలు చేయడం సమంజసమా..**
చేసిన మంచి కూడా వైయస్ జగన్ నేతృత్వంలోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చెప్పుకోలేక పోయింది. కానీ చంద్రబాబు మాత్రం పదే, పదే తప్పుడు ఆరోపణలతో దుష్ప్రచారం చేయడం సమంజసం కాదు. రాష్ట్ర ప్రజలందరూ ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. రూ.9 లక్షల కోట్లు, రూ.10 లక్షల కోట్లు అంటూ అప్పులపైనా అదే తప్పుడు ప్రచారం చేశారు. వాస్తవానికి చంద్రబాబు 2014-19 మధ్య అప్పులతో కలిసి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హయాంలో అధికారికంగా రూ.3.31 లక్షల కోట్లు అని తేలిన తర్వాత అదే తప్పుడు ప్రచారం చేయడం అలవాటుగా మారింది. తాజాగా ఈ రెండేళ్లలోనే రూ. 3.31 లక్షల కోట్లు చేసిన అప్పుపై ఏం సమాధానం చెప్తారు. వైయస్ జగన్ హయాంలో కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమం కోసం రూ.2.81 లక్షల కోట్లు డీబీటీ ద్వారా ప్రజలకు అందిస్తూ రూ.3.31 లక్షల కోట్లు అప్పు చేస్తే చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఎలాంటి సంక్షేమ పథకాలు లేకుండానే రెండేళ్లలో గత ఐదేళ్ల కంటే ఎక్కువ అప్పులు చేశారు. ఆర్థిక మంత్రి మరలా సిగ్గు లేకుండా కేవలం రూ.1 లక్ష కోట్లు మాత్రమే అప్పు చేశామని చెబుతున్నారు. అదే నిజమైతే మీ ఆర్థికశాఖ కార్యదర్శితో లెటర్ విడుదల చేయండని అడిగితే సమాధానం లేకుండా పోయింది.

**హామీల అమల్లో పచ్చి మోసం..**
రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు మోసం చేశాడు. ఉద్యోగ కల్పన మోసం, రూ.3వేల నిరుద్యోగభృతి మోసం, 50 ఏళ్లు దాటిన పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇస్తానన్న పెన్షన్ మోసం, 18-60 సంవత్సరాల లోపు అక్కచెల్లెళ్లకు రూ.1500 నెలకి ఇస్తానన్న హామీ కూడా మోసంగా మిగిలింది. బడ్జెట్ లో వీటి పై ప్రస్తావన కూడా లేదు. ప్రజలు వీటిపై ఎక్కడ నిలదీస్తారేమోనన్న భయంతో పదే, పదే తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను డైవర్ట్ చేయడానికి ప్రయత్నిస్తున్నాడు. చివరకు కేబినెట్ మీద కూడా చంద్రబాబుకి పట్టు లేకుండా పోయింది. ఇక డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అయితే కేబినెట్ మీటింగ్ కి కూడా హాజరు కాకుండా తన సినిమా ప్రమోషన్ లో మునిగిపోయాడు. తన సినిమా టిక్కెట్ల ధరల పెంపు గురించి మాట్లాడుతున్న పవన్ కళ్యాణ్ రైతుల ఇబ్బందులు గురించి మాత్రం నోరు విప్పడం లేదు. రెండేళ్లలో కేబినెట్ మీటింగ్ కే మంత్రులు రావడం లేదంటే ప్రభుత్వం మీద చంద్రబాబుకి ఏమాత్రం పట్టు ఉందో అర్థం అవుతుందని విమర్శించారు.

**రైతులను నిలువునా ముంచిన కూటమి..**
కేంద్రంతో సంబంధం లేకుండా వాళ్లిస్తున్న రూ.6 వేలు కాకుండా ప్రతి రైతుకు ఏటా రూ.20వేలు ఇస్తానని తొలి ఏడాదే ఎగరగొట్టిన చరిత్ర చంద్రబాబుది. అదే వైయస్.జగన్ హయాంలో పెట్టుబడి సాయం కింది రూ.50వేలు రైతులకు ఇస్తానని చెప్పి ఎన్నికల అనంతరం రూ.50 వేలకు బదులు రూ.67,500 ఐదేళ్లు ఇచ్చిన చరిత్ర వైయస్ జగన్ ది. అదే రైతులకు హామీ ఇచ్చి తొలిఏడాది ఏమీ ఇవ్వకుండా ఎగరగొట్టిన చరిత్ర చంద్రబాబు ది. రెండో ఏడు రూ.20వేలకు బదులు కేవలం రూ.14 వేలు మాత్రమే ఇచ్చి అంతా ఇచ్చానని ప్రచారం చేసుకున్న నీచ చరిత్ర చంద్రబాబుది. మామిడి, టమోట తో సహా ప్రతి రైతుకూ గిట్టుబాటు కల్పించకుండా చంద్రబాబు ప్రభుత్వం మోసం చేసింది. ఇవాళ రైతులను ఉద్ధరించానని, హార్టికల్చర్ నా వల్లే వచ్చిందని సిగ్గులేకుండా అబద్దాలు చెబుతున్నాడని శ్రీకాంత్ రెడ్డి దుయ్యబట్టారు.

**సాగునీటి ప్రాజెక్టులూ నా వల్లే అంటూ భజన..**
ఇక సాగునీటి ప్రాజెక్టులనూ నేనే నిర్మించానంటూ చంద్రబాబు అబద్దాలు చెబుతున్నారు. ఒక్క ప్రాజెక్టుకైనా డీపీఆర్ కూడా సిద్ధం చేయని చరిత్ర చంద్రబాబుది. ఎన్టీఆర్ హయాంలో రూ.600 కోట్లతో తెలుగుగంగ ప్రాజెక్టు కట్టిన తర్వాత వైయస్.రాజశేఖర్ రెడ్డి హయాంలో రూ.3,800 కోట్లు ఖర్చు పెట్టి పూర్తిస్థాయికి తీసుకొచ్చారు. పోతిరెడ్డి పాడు ఎత్తు పెంచితే అందుకు వ్యతిరేకంగా మాట్లాడారు. రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టు నిర్మాణం వైయస్ జగన్ ప్రారంభిస్తే దాన్ని నిలుపుదల చేసిన వ్యక్తులు మీరే. నువ్వా రాయలసీమను ఉద్ధరించేది. రాయలసీమ లో ఉండాల్సిన హైకోర్టును లేకుండా సీమకు అన్యాయం చేసింది మీరే కదా. లా యూనివర్సిటీని తరలించిన పాపం మీదే. ఇన్ని రకాల రాయలసీమ ప్రజల కడుపు కొడుతూ పదే, పదే తప్పుడు ప్రచారంతో నువ్వు చేస్తున్న మోసాలకు ప్రజలతో పాటు దేవుడు కూడా మొట్టి కాయలు వేయడం ఖాయమన్నారు.

**ప్రచార పిచ్చితో ప్రజల ప్రాణాలు బలిగొన్న బాబు..**
మీ ప్రచార పిచ్చితో గతంలో గోదావరి పుష్కరాల్లో జరిగిన తొక్కిసలాటలో నిర్దాక్షిణ్యంగా 19 మందిని పొట్టన పెట్టుకున్నారు. దాని గురించి ప్రశ్నిస్తే ప్రమాదాల్లోనూ, పూరి జగన్నాథ రథయాత్రలో చనిపోరా అంటూ హేళనగా మాట్లాడారు. కందుకూరు మీటింగ్ లో 7 మంది, గుంటూరులో చీరల పంపిణీలో 5 మంది, తిరుపతిలో వైకుంఠదర్శన టిక్కెట్ల కోసం తొక్కిసలాటలో 6మంది, కాశీబుగ్గ తొక్కిసలాటలో 9 మంది. పదే పదే మీ హయాంలో ప్రజల ప్రాణాలను హరిస్తూనే ఉన్నారు. తాజాగా కదిరి నర్సింహస్వామి రథయాత్రలో తొక్కిసలాట పాపం మీదే కదా. ఇప్పటికైనా ప్రజల మేలు కోసం పనిచేయండి బాబు. ప్రజల్లో చిరస్థాయిగా నిల్చిపోయే పనులు చేపట్టండని హితువు పలికారు.

**ఇది కల్తీ కూటమి పాలన..**
ఇవాళ తన రెండేళ్ల పాలనలో అంతా తానే చేశానని చంద్రబాబు అవే అబద్దాలను పదే, పదే చెబుతున్నాడు. పాలమూరు కరువును పారదోలింది వైయస్ఆర్. అయితే ఉత్తరాంధ్రాలో ఉద్దానం కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఆ ప్రాంత ప్రజల ప్రతి ఇంటికి తాగునీరందించిన ఘటన వైయస్ జగన్ కే దక్కుతుంది. ఇవాళ పాలల్లోనూ, నెయ్యిలోనూ ప్రతిదీ కల్తీ. కల్తీ పాల వల్ల ఒక్క తూర్పుగోదావరి జిల్లాలోనే 20 మందికి పైగా చనిపోయారు. ఇవి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే. తిరుమలకు సరఫరా చేసే నెయ్యి విషయంలోనూ మోసమే. రూ.322 ఉన్న నెయ్యిని రూ.750 పైగా పెంచి ఇందాపూర్ ద్వారా వేల కోట్ల రూపాయలు దోచుకున్నారు. స్వయంగా కేబినెట్ మీటింగ్ లో హెరిటేజ్ కంపెనీ రూ.200 కోట్లు పెట్టుబడి పెడుతుందని మీ కంపెనీకి మీరే రూ.100 కోట్లు రాయితీలు ప్రకటించుకోవడానికి సిగ్గుగా లేదా. ఇన్ని రకాలగా ప్రజల జీవితాలతో ఆడుకుంటున్న మీ తీరు మారకపోతే కచ్చితంగా ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని హెచ్చరించారు.

**పాత్రికేయుల ప్రశ్నలకు బదులిస్తూ..**
వివేకానంద రెడ్డి హత్య కేసులో వాస్తవాలేంటో చెబుతున్నా మరోపక్క తమకున్న వ్యవస్థల ద్వారా తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు. మేం ఇప్పటికైనా ఛాలెంజ్ చేస్తున్నాం. అధికారం మీ చేతుల్లో ఉంది. తప్పు చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మెడికల్ కాలేజీలతో పాటు మా హయాంలో జరిగిన అభివృద్ధిపై మేం ప్రజలకు వాస్తవాలు చెబుతుంటే మాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలనకు రమ్మంటే మాత్రం ముందుకు రావడం లేదని మండిపడ్డారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం పై టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని శ్రీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కడప మేయర్ పాకా సురేష్ తో పాటు వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు..

# బీసీలకు కూడా త్వరలో రక్షణ చట్టం తీసుకొస్తున్న కూటమి ప్రభుత్వం

## ఏపీలో త్వరలో బీసీ రక్షణ చట్టం - మంత్రి సవిత

**విజయవాడ ప్రతినిధి, మార్చి 14,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

ఏపీలో త్వరలో బీసీ రక్షణ చట్టం తీసుకురాబోతున్నట్లు మంత్రి సవిత తెలిపారు. దీనికి సంబంధించి ఇప్పటికే ముసాయిదా సిద్ధం చేసినట్లు చెప్పారు. కులం, వృత్తి పేరుతో దూషిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బీసీ రక్షణచట్టం విధివిధానాల రూపకల్పనపై విజయవాడ తాడిగడప బీసీ డైరెక్టర్ కార్యాలయంలో మంత్రులు సవిత, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర చర్చించారు. చట్టం డ్రాఫ్టపై బీసీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీసీ సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలుతీసుకోవాలని నిర్ణయించారు.అనంతరం మంత్రి సవిత మీడియాతో మాట్లాడుతూ బీసీల మానప్రాణాలకుభరోసా కల్పించేలా బీసీ రక్షణ చట్టం తీసుకురాబోతున్నట్లు చెప్పారు. “కోర్టుల్లోనూ వీగిపోకుండా న్యాయనిపుణులతో చర్చించాం. దేశంలోనే తొలిసారిగా ఏపీలో చట్టం అమలు చేయబోతున్నాం. భేటీ వివరాలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించాం. బీసీలను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలపాలన్నదే మా లక్ష్యం“ అని మంత్రి సవిత తెలిపారు

# తెలంగాణలో టెన్త్ పరీక్షలు ప్రారంభం

## అరగంట ముందుగానే కేంద్రాలకు అనుమతి

**హైదరాబాద్,మార్చి 14 (రిపబ్లిక్ న్యూస్):**
తెలంగాణలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు జరగనున్నాయి. అరగంట ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షలు ఏప్రిల్ 16 వరకు కొనసాగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 5,28,239 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 2676 కేంద్రాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన పరీక్షా కేంద్రాలలోనికి అనుమతిస్తామని అధికారులు చెప్పారు. పలు కేంద్రాల్లో విద్యార్థులకు ఆల్‌ది బెస్టు చెబుతూ ఫ్లెక్సీలు వెలిశాయి. ఇందులో 5,17,727మంది రెగ్యులర్, ఒకసారి ఫెయిలైన 10,512మంది విద్యార్థులు ఉన్నారు. ఈసారి ప్రైవేటు పాఠశాల నుంచి అత్యధికంగా 2,50,015 విద్యార్థులుండగా, ప్రభుత్వ బడుల నుంచి 2,07,573 మంది, సంక్షేమ గురుకులాల నుంచి 60,139 మంది విద్యార్థులు ఉన్నారు. పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,676 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 1,582 ప్రభుత్వ, 1,094 ప్రైవేటు విద్యాసంస్థలున్నాయి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తెలిపారు. పాఠశాల గుర్తింపు తెలియకుండా సాధారణ దుస్తుల్లోనే విద్యార్థులు పరీక్షకు రావాలని కోరారు. పరీక్షల పర్యవేక్షణకు 144 ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటుచేశామన్నారు.

# అవుకులో గౌడ కమ్యూనిటీ కార్యాలయం ప్రారంభం

## గౌడ సంఘం కొత్త కమిటీ సమర్థంగా పని చేయాలి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి





**అవుకు మార్చి 14 రిపబ్లిక్ (న్యూస్)**
అవుకు పట్టణంలో గౌడ కమ్యూనిటీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ గౌడ కమ్యూనిటీ గత 20 సంవత్సరాలుగా ఐక్యత లేకుండా ఉన్నప్పటికీ, ఇప్పుడు ఏకతాటిపైకి వచ్చి కమిటీ ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమని అన్నారు. ఈ సందర్భంగా తనను ఆశీర్వదించి ఆత్మీయంగా సన్మానించిన గౌడ సంఘ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.
తెలుగుదేశం పార్టీ ఎప్పటినుంచో బీసీలకు అండగా నిలుస్తోందని, ఇది బీసీల పార్టీ అని ఆయన పేర్కొన్నారు. పార్టీ కష్టకాలంలో బీసీలే వెన్నుముకగా నిలిచారని అన్నారు. తెలుగుదేశం పార్టీలో ప్రారంభం నుంచే గౌడ కమ్యూనిటీకి ప్రాధాన్యత ఇస్తూ వచ్చామని చెప్పారు. గతంలో దేవేంద్ర గౌడ్‌కు హోం మంత్రిగా అవకాశం కల్పించామని, ప్రస్తుతం అత్యంత ప్రాధాన్యత గల రెవెన్యూ శాఖను అనగాని సత్యప్రసాద్‌కు అప్పగించడం కూడా గౌడ సామాజిక వర్గంపై పార్టీకి ఉన్న గౌరవాన్ని సూచిస్తుందని అన్నారు.
గౌడ సామాజిక వర్గం మరియు కళ్ళు గీత కార్మికుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు. రాష్ట్రంలో 10 శాతం లిక్కర్ షాపులను వారికి కేటాయించి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. గతంలో కులవృత్తులను ప్రోత్సహించేందుకు “ఆదరణ” వంటి పథకాలను తెలుగుదేశం పార్టీ తీసుకొచ్చిందని గుర్తుచేశారు.
గౌడ సంఘం తరఫున ఏర్పాటు చేసిన నూతన కమిటీ సమాజ అభివృద్ధి కోసం సమర్థంగా పనిచేయాలని మంత్రి సూచించారు. గౌడ సంఘానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.
అవుకు ప్రాంతంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.540 కోట్లతో జలజీవన్ మిషన్ ద్వారా బనగానపల్లె నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి తాగునీరు అందించే ప్రయత్నం చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టుకు భారీగా నిధులు కేటాయించి సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. 2019లో అవుకు మండలంలో వైసీపీకి అధిక మెజార్టీ ఇచ్చిన ప్రజలకు వారు ఏమి చేశారో చెప్పాలని మంత్రి ప్రశ్నించారు. గత ఎన్నికల్లో తనకు అవుకులో మంచి మెజార్టీ ఇచ్చిన ప్రజల రుణం తీర్చుకునేందుకు రూ.6 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నామని అన్నారు.
రాష్ట్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ నాయకత్వంలో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నామని చెప్పారు. బనగానపల్లె నియోజకవర్గంలో భారీగా ఆర్ అండ్ బి రోడ్లు, ఎన్ హెచ్ రహదారులు తీసుకొచ్చామని తెలిపారు.
కూటమి ప్రభుత్వం కక్షసాధింపులకు అతీతంగా పాలన అందిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఎన్నికల వరకు మాత్రమే రాజకీయాలు, ఆ తర్వాత సంక్షేమ అభివృద్ధి పాలన అందించడమే తమ లక్ష్యమని సీఎం చంద్రబాబు ఆలోచనల మేరకు పనిచేస్తున్నామని అన్నారు. పల్లెల్లో శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచిస్తున్నారని మంత్రి బిసి జనార్దన్ రెడ్డి తెలిపారు
ఈ కార్యక్రమంలో నాయకులు చల్లా భాస్కర్ రెడ్డి అవుకు మండల అధ్యక్షుడు ఉగ్రసేనారెడ్డి కాశిపురం రామిరెడ్డి వంగల పరమేష్ రెడ్డి సుగాలి వెంకటరమణ నాయక్ అరుణ్ నాయక్ దంతెల రమణఈడిగ సంఘం అధ్యక్షులు మద్దిలేటి గౌడ్ శంకర్ గౌడ్ మధుసూదన్ గౌడ్
తదితరులు పాల్గొన్నారు

రిపబ్లిక్



# అసెంబ్లీలో ప్రధాన సమస్యలు అజెండా కావాలి !

**మార్చి 14 (రిపబ్లిక్ న్యూస్):**
అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 16న సోమవారం నుంచి ప్రారంభం కాబోతున్నాయి. సమస్యలు అనేకం ఉన్నాయి. సమస్యలపై చిత్తశుద్ధితో చర్చించాలి. ప్రజల కోణంలో సమస్యలపై చర్చలు జరగాలి. అంతే తప్ప అధికార, విపక్షాల మాటల యుద్ధానికి అసెంబ్లీ వేదిక కారాదు. తెలంగాణ ఏర్పాడి 12 ఏళ్లు కావస్తున్నా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. నాయకులు బాగుపడుతున్నారే తప్ప ప్రజలు బాగు పడడం లేదు. జీతాలకు డబ్బులు లేవు. ఉన్న డబ్బులు మిత్తీలకు సరిపోవడం లేదు. ట్రిలియన్ ఎకానమీ మాటలు మాట్లాడే ముందు, అప్పులను కంట్రోల్ చేయడం, దుబారా ఖర్చులను తగ్గించడం, ఉచిత పథకాలపై సమీక్షించడం అవసరం. ఖమ్మం జిల్లా వెలుగమట్లలో అన్యాయంగా పేదల ఇళ్ళు కూల్చి వారిని రోడ్డున పడేశారు. దానికి సమాధానం చెప్పాలి. ముగ్గురు మంత్రులు ఉన్న జిల్లాలో ఇంతటి ఘోరం జరగడం దుర్మార్గం కాకపోతే మరోటి కాదు. అందులో కేవలం ఓ 300 పైచిలుకు మందికి పట్టాలు ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు. ఇల్లున్న వారందరినీ కూర్చుండబెట్టి చర్చిస్తే సమస్య వచ్చేది కాదు. దీనిపై సిఎం రేవంత్ రెడ్డి ఇప్పటి వరకు ఎలాంటి ప్రతిస్పందన వ్యక్తం చేయలేదు. ఇకపోతే ప్రభుత్వ ప్రధాన ఎజెండాగా మూసీ ప్రక్షాళన ముందుకు వచ్చింది. మూసీని ప్రక్షాళన చేయాల్సిందే. అక్రమాలను తొలగించాల్సిందే. హైదరాబాద్‌కు విముక్తి కలగించాల్సిందే. దీనిపై



పారదర్శకత ముఖ్యం. గతంలో కాళేశ్వరం నిర్మించిన కెసిఆర్ ఎలాంటి పారదర్శక లేకుండా నిర్మాణం చేయడం వల్ల లక్షకోట్లు గోదాట్లో పోసినట్లు అయ్యింది. ప్రజలు చెమటోడ్చి కడుతున్న పన్నులను ఇలా దుబారా చేయడం క్షమించరాని నేరం. ఇప్పుడు మూసీ ప్రక్షాళన కూడా అలా కాకూడదు. అందువల్ల దీనిప అఖిలపక్షంతో పాటు, పర్యావరణవేత్తలతో కమిటీలు వేసి చర్చించాలి. అలాగేఅసెంబ్లీలో సమగ్రంగా చర్చించాలి. నిర్మోహ మాటంగా ఎలా ప్రాజెక్టును ముందుకు తీసుకుని వెళ్లాలనుకుంటున్నారో అసెంబ్లీ ద్వారా ప్రజలకు తెలియ చేయాలి. లండన్, దక్షిణ కొరియా, పారిస్, సింగపూర్, దుబాయ్, జపాన్ ఇలా అనేక రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుల స్ఫూర్తితో మూసీ నదీ పరీవాహకం ప్రక్షాళనతో పాటు భారీ ఎత్తున ఆకాశహర్మ్యాల మధ్య వెలుగులు విరజిమ్మితే అంతకంటే కావాల్సిందేముంది. అయితే ఇది ఎంతవరకు సాధ్యమో ఆలోచించాలి. మూసీలో ఉన్న శ్మశాన వాటికలు, పక్కను ఉన్న ప్రార్థనా మందిరాలు తొలగంచకుండా ముందుకు సాగడం కష్టం.బాపూఘాట్ నుంచి గౌరెల్లి వరకు 200 మీటర్ల వెడల్పుతో విస్తరించనున్న నదికి రెండువైపులా హోటళ్లు, రెస్టారెంట్లు, వినోద కేంద్రాలు, రాత్రి మార్కెట్లతో జిగేల్ మనిపించేందుకు రేవంత్ సర్కార్ రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు ఇచ్చిన మూసీ సుందరీకరణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చూస్తే అద్భుతంగా ఉంది. కొత్త చరిత్రను లిఖించేందుకు పరీవాహకంలోని నిరుపేదలంతా తమ ఇండ్లు త్యాగం చేయాలని పిలుపు నిచ్చింది. ఈ క్రమంలో ఇక్కడ నివిస్తున్న పేదలు కావచ్చు, ఆక్రమణదారులు కావచ్చు వారిని తరిలిస్తే ప్రత్యామ్నాయ స్థలాలు చూపాలి. భూములు, ఇండ్లు కోల్పోతున్న బాధితుల గోడు పట్టించుకోవాలి. ప్రాజెక్టు సమగ్రంగా ముందుకు సాగేందుకు పర్యావరణవేత్తలు, మేధావుల సలహాలు తీసుకుని సాగాలి. పెట్టుబడులు రాబట్టి నైట్ మార్కెట్‌తో మూసీ పరీవాహకాన్ని రియల్ వ్యాపారంతో కూడిన ఆర్థిక కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్న ఆరోపణలపై గట్టిగా సమాధానం ఇవ్వాలి. జంట జలాశయాల నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల మూసీ సుందరీకరణకు నది రెండువైపులా బఫర్‌జోన్ వరకు కూల్చివేసే ఇండ్లు, నిర్మాణాలపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. ముందుగా వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. వారికి కొత్తగా ఇళ్లు కట్టి ఇవ్వాలి. మూసీ ప్రాజెక్టుకు మొత్తంగా 3 వేలకు పైగా ఎకరాలు సేకరించి, 10,017 ఇండ్లే కూల్చివేయనున్నట్టు ప్రభుత్వం 2025, డిసెంబర్‌లో గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. కేసీఆర్ ప్రభుత్వం మూసీ ప్రక్షాళన కోసం ఏటా ఐదు టీఎంసీల గోదావరి జలాలను జంట జలాశయాలకు తరలించాలనే ప్రణాళిక వేసింది. కాంగ్రెస్ మల్లన్నసాగర్ నుంచి 20 టీఎంసీలు తరలించి అందు లో 15 టీఎంసీలను నగర తాగునీటి కోసం, మిగిలిన ఐదు టీఎంసీలు మూసీ ప్రక్షాళనకు మళ్లిస్తామని చెప్పింది. ఆ మేరకు టెండర్లు పూర్తి చేసి పనులు కూడా అప్పగించింది. కానీ అది అమల్లోకి రాలేదు. సరికదా కాళేశ్వరంతో భారీగా దోపిడీ ప్రాజెక్ట్ తెరముందుకు వచ్చింది. ఇప్పుడది గుదిబండగా మారింది.

మూసీ సుందరీకరణ పేరిట సర్కార్ బఫర్ జోన్‌ను కూడా చెరపట్టేందుకు సిద్ధమైందని పీపీటీలో తేలింది. మూసీ బఫర్ జోన్ పరిధిలోనే మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ ఉన్నదనీ, ఈ భవనమే అక్రమమని, దాన్ని ఖాళీ చేయాలని సర్కార్ చెప్తున్నది. అదే బఫర్ జోన్‌లో భారీ నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించింది. మూసీ మధ్యలోనే గాంధీ సరోవర్ పేరిట అతిపెద్ద టవర్, ఇతర భవనాలు కట్టనున్నట్టు పీపీటీ ద్వారా స్పష్టమైంది. ప్రాజెక్టు విషయంలో మధు రిడ్జ్ అపార్ట్‌మెంట్‌కు వర్తించిన బఫర్ జోన్ నిబంధనలు, రివర్ బెడ్‌లోనే కడుతున్న భారీ నిర్మాణాలకు, పక్కనే ఉండే భారీ రాట్నం, 20 అంతస్తుల్లో నిర్మించే భవనాలకు వర్తించవా? అని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. అలాగే నార్సింగ్‌లో కడుతున్న బహుళ అంతస్తు మూసీలోనే ఉన్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ఆందోళనలు చేశారు. కవిత ఇక్కడ ధర్నా కూడా చేపట్టారు. ఇవన్నీ కూడా చర్చించాల్సిన అంశాలు. ప్రభుత్వం దాపరికం లేకుండా అన్ని విషయాలు అసెంబ్లీ ముందు పెట్టాలి. సమగ్రంగా చర్చించాలి. వీటికి సమాధానం కూడా చెప్పాలి.

## మొజ్తబా ఆచూకీ చెబితే.. .10మిలియన్ డాలర్లు

### రివార్డ్ ఫర్ జస్టిస్ ప్రకటించిన అమెరికా

**వాషింగ్టన్,మార్చి 14 (రిపబ్లిక్ న్యూస్):**



ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎవరు పగ్గాలు చేపట్టినా తమ తదుపరి టార్గెట్ అయనే అవుతారని ఇంతకుముందే ప్రకటించిన అమెరికా ఆ దిశగా మరో ముందడుగు వేసింది. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఆచూకీ కానీ, ఆయనకు సంబంధించిన కీలక సమాచారం కానీ అందించిన వారికి భారీ రివార్డు ప్రకటించింది. ఆచూకీ ఇచ్చిన వారికి 10 మిలియన్ డాలర్లు అంటే రూ.92 కోట్లు నజరానా ఇస్తామని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రకటించింది. 'రివార్డ్ ఫర్ జస్టిస్' కార్యక్రమం క్రింద ఈ బౌంటీ ఇస్తామని తెలిపింది. అమెరికా విదేశాంగ నిర్వహించే ఒక ముఖ్యమైన ఉగ్రవాద నిరోధక కార్యక్రమమే 'రివార్డ్ ఫర్ జస్టిస్'. ఈ ప్రోగ్రాం కింద అంతర్జాతీయ నేరస్తులు, నెట్‌వర్క్‌ల సమాచారం అందించి, వారిని పట్టుకోవడంలో సహాయపడిన వారికి మిలియన్ డాలర్ల రివార్డు ఇస్తుంటారు. అమెరికన్ల రక్షణ, జాతీయ భద్రత బలోపేతం చేయడమే ఆర్ఎఫ్‌జే లక్ష్యం. కాగా, అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించిన వ్యక్తుల జాబితా మొజ్తాబాతో పాటు ఆయన కార్యాలయ డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అలీ అస్గర్ హెజాజీ, సెక్యూరిటీ కౌన్సిల్ చీఫ్ అలీ లారీజానీ, ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు. ఆచూకీ తెలిపిన వారికి రివార్డుతో పాటు వారిని వేరే ప్రాంతానికి తరలించే సదుపాయం కూడా కల్పిస్తామని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రకటించింది.

-------------------

## ఇరాన్ దాడులతో దుబాయ్ అతలాకుతలం

### షాపింగ్ మాల్స్ మూతతో పర్యాటకం బంద్

దుబయ్,**మార్చి 14 (రిపబ్లిక్ న్యూస్):**:దుబాయ్.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బిలియనీర్ల కలల నగరం. పెట్టుబడులకు, రక్షణకు, స్వేచ్ఛా జీవితానికి దుబాయ్ ప్రతీక. విమానయాన రంగానికి కీలక స్థానం. ఎప్పుడూ విదేశీ పర్యాటకులు, పెట్టుబడిదారులతో కళకళలాడే నగరం. అలాంటి మహా నగరాన్ని ఇరాన్ యుద్ధం కళా విహీనంగా మార్చింది. పశ్చిమాసియాలో యుద్ధం దుబాయ్ నగరంపై తీవ్ర ప్రభావం చూపించింది .యుద్ధం నేపథ్యంలో దుబాయ్ నగరం బోసిపోయింది. చాలా ప్రాంతాల్లో షాపింగ్ మాల్స్, వాణిజ్య సంస్థలను మూసేశారు. రోడ్లపై జనసంచారం లేదు. నిత్యం పర్యాటకులతో కళకళలాడే బీచ్‌లు ఖాళీగా కనిపిస్తున్నాయి. బుర్జ్ అల్ అరబ్ సహా పలు ప్రముఖ హోటళ్లు క్షిపణి దాడులకు గురి కావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. చాలా మంది దేశం విడిచి వెళ్లిపోయారు.విమాన సర్వీసులు భారీగా రద్దవ్వడంతో పర్యాటక రంగమూ కుదేలైంది. డిమాండ్ పెంచడానికి హోటళ్లు భారీ డిస్కౌంట్లు ఇస్తున్నా స్పందన లేదు. సిటీ, స్టాండర్డ్ చార్టెర్డ్ తదితర అంతర్జాతీయ బ్యాంకులు తమ కార్యాలయాలను ఖాళీ చేశాయి. వీధుల్లో జనసంచారం కనిపించడం లేదు.

## మరింత దిగజారిన బంగారం ధరలు

**న్యూఢిల్లీ,మార్చి 14 (రిపబ్లిక్ న్యూస్):**



అంతర్జాతీయంగా అనిశ్చితి కారణంగా స్టాక్ మార్కెట్లు, రూపాయి విలువతో పాటు బంగారం, వెండి ధరలు కూడా మరింత కిందకు దిగివస్తున్నాయి. శనివారం కూడా బంగారం, వెండి ధరలు భారీగా తగ్గాయి. మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తుండడమే బంగారం, వెండి తగ్గుదలకు కారణంగా కనిపిస్తోంది. శనివారం ఉదయం 10:10 గంటల సమయంలో హైదారాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,59,660కు చేరుకుంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.1030 మేర తగ్గుదల నమోదు చేసింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,46,350 దగ్గర ఉంది . నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.950 మేర తగ్గింది. రోవైపు వెండి ధరలు కూడా శనివారం తగ్గుదల నమోదు చేశాయి. వెండి కిలోకు రూ.4,900 వేల మేర తగ్గింది. దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2.75 లక్షలుగా ఉంది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2.8 లక్షలుగా ఉంది. గమనిక: పైన పేర్కొన్న బంగారం, వెండి రేట్లు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. కాబట్టి వీటిని కొనుగోలు చేసే సమయంలో మళ్లీ ధరలు తెలుసుకోవాలని సూచన.

--------------

# అమెరికాలో వీసా మోసాలు

### 11మంది భారతీయుల అరెస్ట్
### నేరం రుజువైతే జైలుశిక్ష తప్పదు




**వాషింగ్టన్,మార్చి 14 (రిపబ్లిక్ న్యూస్):**అమెరికాలో కొందరు భారతీయులు అక్రమంగా నివసించేందుకు చేసిన మాస్టర్ ప్లాన్‌ను ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) ఛేదించింది. వీసా మోసానికి కుట్ర పన్నారనే ఆరోపణలపై నాలుగు రాష్ట్రాల్లో చేపట్టిన ఆపరేషన్‌లో 11 మందిని అరెస్ట్ చేసింది. సదరు వ్యక్తులు నేర బాధితులుగా డ్రామాలాడి, ఇమ్మిగ్రేషన్ పొందేందుకు సాయుధ దోపిడీలకు పాల్పడ్డారని ఎఫ్‌బీఐ ఆరోపించింది. ఎఫ్‌బీఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ముఠా ప్రణాళికలో భాగంగా మసాచుసెట్స్ రాష్ట్రంలోని లిక్కర్ షాప్‌లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, కన్వీనియెన్స్ స్టోర్లలో నకిలీ దోపిడీలు జరుగుతాయి. ఈ డ్రామాలో ఓ వ్యక్తి ఆయుధంతో షాపులోకి ప్రవేశించి అక్కడి గుమాస్తాను బెదిరించి నగదుతో ఉడాయించగా.. ఇదంతా సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ అవుతుంది. ఈ విషయం కాస్త ఆలస్యంగా పోలీసులకు తెలుస్తుంది. ఆ తర్వాత దొంగ దొరక్కుండా జాగ్రత్తపడతాడు. స్టోర్‌లో దోపిడీ నిర్వహించేందుకు యజమాని, అలాగే బాధితుడిగా నటించినందుకు గుమాస్తాకు డబ్బులు చెల్లిస్తారు. ఈ డ్రామా అంతా పూర్తయ్యాక తామే ఈ దోపిడీ చేశామని పోలీసులకు సమాచారమిచ్చి.. ఆ సాక్ష్యాలతో 'యు' నాన్ ఇమిగ్రెంట్ వీసాకు దరఖాస్తు చేసుకుంటుంటారు. అయితే.. మొత్తం వ్యవహారాన్ని రాంభాయ్ పటేల్ అనే వ్యక్తి నడిపిస్తున్నారని తెలుస్తోంది. ఇలా వీసాలు పొందేందుకు బాధితులుగా నటించేవారు అతడికి భారీగా డబ్బులిస్తారని సమాచారం. అతడే ఈ ప్లాన్‌ను అమలు చేస్తుంటాడు. కాగా.. రాంభాయ్ పటేల్, అతడి డ్రైవర్‌ను అధికారులు ఇప్పటికే పట్టుకున్నారు. ప్రస్తుతం అరెస్టయిన వారిలో జితేంద్ర కుమార్ పటేల్, మహేశ్ కుమార్ పటేల్, సంజయ్ కుమార్ పటేల్, అమితాబెన్ పటేల్, సంగీతాబెన్ పటేల్, మితుల్ పటేల్, రమేష్‌భాయ్ పటేల్, రోనక్ కుమార్ పటేల్, సోనాల్ పటేల్, మింకేశ్ పటేల్ ఉన్నారు. వీరిని బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టులో హాజరుపరచనున్నట్టు తెలుస్తోంది. వీసా మోసానికి పాల్పడినట్టుగా నేరం రుజువైతే.. మూడేళ్ల జైలు శిక్ష, 2.50 లక్షల డాలర్లు భారత కరెన్సీలో సుమారు రూ.2.10 కోట్లు భారీ జరిమానా విధించే అవకాశం ఉంది.

## - ముస్లిం మైనార్టీ సోదరులు ఆహ్వానం మేరకు ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథులుగా - పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్ రెడ్డి

**- వక్ఫ్ బోర్డు భూములపై మిథున్ రెడ్డి షాకింగ్ కామెంట్స్..**

**- 50 సంవత్సరాల ప్రత్యక్ష రాజకీయ జీవితంలో ఏనాడు ముస్లింలను మోసం చేయలేదని పెద్దిరెడ్డి వ్యాఖ్యలు..**

**పుంగనూరు మార్చి 14 - (రిపబ్లిక్ న్యూస్) -**



పెద్దిరెడ్డి కుటుంబానికి కంచుకోట వాళ్ల కుటుంబ ఆదరణతో అన్ని విధాల సహకారంతో అభివృద్ధి చెందిన పుంగనూరు లోని అంజుమన్ షాధీమహల్ నందు పుంగనూరు మున్సిపల్ చైర్మన్ అలీమ్ భాష తో సహా రాయలసీమ జిల్లాల జోనల్ ప్రెసిడెంట్ ఫక్రుద్దీన్ షరీఫ్, మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎండి రహంతుల్లా ముస్లిం మైనార్టీ సోదరులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ముస్లిం, మైనార్టీ సోదరులు ఆహ్వానం మేరకు తండ్రి, తనయుడు మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత, స్థానిక శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రతి ఏటా నిర్వహించే విధంగానే ఈసారి కూడా పట్టణంలోని 28 మసీదులకు చెందిన ముస్లింలకు ఈ విందు ఏర్పాటు చేశారు. ముస్లిం సోదరులతో కలిసి ఇరువురు ప్రత్యేక ప్రార్థనలు చేసి తోటి ముస్లింలకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విడిపించారు. ముందస్తు ముస్లిం మైనార్టీ సోదరులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర రంజాన్ మాస దీక్షలను నిష్ఠగా ఆచరిస్తున్న ముస్లిం సోదరులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరికీ అల్లా ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఇఫ్తార్ విందులో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని మిథున్ రెడ్డి అన్నారు. రంజాన్ మాస విశిష్టతను కొనియాడారు. మనుషులంతా సోదర భావంతో ఉండాలని అన్ని మతాలు కోరేది ఒకటేనన్నారు. రంజాన్ మాసంలో రోజా ముగించే సమయానికి మీతో ఇఫ్తార్ విందులో పాల్గొనడం మీతో గడపడం ఎంతో అనుభూతినిచ్చింది. రాజకీయంగా నాకు ఇక్కడికి వచ్చినట్టు భావించట్లేదు. సొంతింటికి వచ్చినట్టుంది. మీకు ఏ సమస్య వచ్చినా ఏ ఇబ్బంది వచ్చినా మేము అండగా ఉంటాం. ఏ క్షణమైన మీరు నేరుగా వచ్చి కలవచ్చు. అర్ధరాత్రి సమయంలో వచ్చినా కూడా మీ పని చేసి పెడతామని పుంగనూరు ప్రజలకు మాటిచ్చారు. రాష్ట్రంలోనే కాకుండా దేశంలో పలు దారుణమైన సమస్యలను ఎదుర్కొంటున్నాం. మీరందరూ గమనిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టినప్పటి నుంచి రాష్ట్ర ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వక్ఫ్ బోర్డు భూములు అన్యక్రాంతం కాకుండా ఆపాలని గత ప్రభుత్వ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంతగానో ప్రయత్నించింది. కానీ ఈ ప్రభుత్వం బోర్డు భూములకు సంబంధించి బిల్లు పాసైంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి మెజారిటీ లేకున్నా వక్ఫ్ బోర్డు బిల్లును ఆమోదించారు. వేరే పేర్లతో నేడు వక్ఫ్ భూములు అన్యక్రాంతం అయ్యే పరిస్థితిలు దాపురించాయి. ప్రతి ఒక్క ముస్లిం సోదరుడు తమ గొంతెత్తి గళం వినిపించాలి. మీకు మద్దతుగా మేము నిలబడతామని మిథున్ రెడ్డి అన్నారు. మీ అందరి దీవెనలు మా కుటుంబం పై ఎల్లవేళలా ఉండాలని ఆశిస్తున్నానని మిథున్ రెడ్డి పేర్కొన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లపై సెటైర్ వేశారు. చంద్రబాబు నాయుడు ను ముఖ్యమంత్రిగా 15 సంవత్సరాలు కోరుకునే వ్యక్తి పవన్ కళ్యాణ్ అని ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉన్న పవన్ కళ్యాణ్ రాష్ట్రానికి ఏం చేశారని మాజీ మంత్రి పెద్దిరెడ్డి ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ ను సూటిగా ప్రశ్నిస్తూ మిమ్మల్ని ముఖ్యమంత్రిగా చూడాలనుకున్న మీ పార్టీ నాయకులు మీ అభిమానుల పరిస్థితి ఏంటని జనసేన ఎమ్మెల్యేలకు అపాయింట్మెంట్ ఇవ్వలేని స్థితిలో పవన్ కళ్యాణ్ ఉన్నారని ఎంతసేపు చంద్రబాబు భజన చేయడం తప్ప చంద్రబాబుతో బాగం కోసం పనిచేస్తున్నట్టుందని పెద్దిరెడ్డి ఎద్దేవా చేశారు. 50 సంవత్సరాల నా ప్రత్యక్ష రాజకీయ జీవితంలో మైనారిటీలకు అన్ని విధాల మంచి చేశాం. ఎవరిని మోసం చేయలేదని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కార్యక్రమానంతరం పుంగనూరు పట్టణంలోని దాదాపుగా 29 మసీదులకు అభివృద్ధికిగాను తమ వంతు సహకారంగా 4 లక్షల 35 వేల రూపాయలు అందించి మతసామరస్యాన్ని చాటారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డప్ప, జానపద అకాడమీ మాజీ చైర్మన్ కొండవీటి నాగభూషణం, అంజుమన్ ప్రెసిడెంట్ సలీం, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆవుల అమరేంద్ర, కౌన్సిలర్లు జయ కుమార్ యాదవ్, కిదర్ ఖాన్, రేష్మ, పట్టణ అధ్యక్షుడు ఇర్ఫాన్ తదితర ముస్లిం సోదరులు వైసీపీ ముఖ్య శ్రేణులు మహబూబ్ బాషా, ఇంతియాజ్, రమణ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు..

